

లంచావతారాలపై ఏసీబీ ఉక్కుపాదం

ఒకే రోజు రూ.33.5 లక్షల స్వాధీనం



చెన్నై, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కార్యాలయాల్లో దీపావళి మామూలు వసూళ్లు జరుగుతున్నాయనే ఆరోపణలు రావటంతో అవినీతి నిరోధక శాఖ అధికారులు జూలు విదిల్చారు. గత రెండు రోజులుగా రాష్ట్రమంతా తనిఖీలు జరుపుతున్నారు. ముఖ్యంగా రిజిస్ట్రేషన్ కార్యాలయాలు, ప్రాంతీయ రవాణాధికారి (ఆర్టీవో), కార్పొరేషన్ జోనల్ కార్యాలయాలు తదితర ప్రాంతాల్లో ఈ తనిఖీలు కొనసాగాయి. నగరంలోని గిండి సిప్కాట్ ప్రాంగణంలో ఉన్న ఆలందూరు జోనల్ కార్యాలయంలో జరిపిన తనిఖీలు రూ.1.20 లక్షల లంచం సొమ్ము పట్టుబడింది. కేకే నగర్ వేంబులి యమ్మన్ ఆలయ వీధిలో ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏసీబీ జరిపిన తనిఖీల్లో భారీగా నగదు స్వాధీనం చేసుకున్నారు. రెడ్‌హిల్స్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, తిరుప్పోరూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఒకే సమయంలో ఏసీబీ తనిఖీలు జరిగాయి. పూందమల్లి పురపాలక సంఘం కార్యాలయంలో తిరువళ్లూరు జిల్లా ఏసీబీ అధికారి శంకర్ తదితర అధికారులు బుధవారం సాయంత్రం తనిఖీలు ప్రారంభించారు. ఆ తనిఖీలు గురువారం వేకువజాము 3 గంటల వరకు కొనసాగాయి. ఆ తనిఖీల్లో రూ.1.66లక్షల నగదు పట్టుబడింది. ఇదే విధంగా గుమ్మిడిపూండి ఎలావూరు చెక్‌పోస్ట్ వద్ద రూ.90 వేలు, కాంచీపురం పొన్నేరికరై ఆర్టీఓ ఆఫీసులో రూ.60 వేలు, తిరుచ్చి శ్రీరంగం ఆర్టీవో ఆఫీసులో రూ.70వేలు, ఈరోడ్ సత్యమంగళం ఆర్టీవో ఆఫీసులో రూ.4లక్షల చొప్పున నగదు స్వాధీనం చేసుకున్నారు. రాణిపేట జిల్లా నవాల్‌పూరులోని ఆర్టీఓ శ్రీదేవి జయంతి నివాసంలో జరిపిన తనిఖీల్లో రూ. 4.49లక్షలకు పైగా నగదు పట్టుబడింది. ఈరీతిలోనే రాష్ట్రమంతటా 37 ప్రభుత్వ కార్యాలయాల్లో బుధవారం సాయంత్రం నుండి గురువారం ఉదయం వరకు జరిపిన తనిఖీలలో రూ.33.5లక్షల మేర లంచం సొమ్ము పట్టుబడినట్లు అధికారులు ప్రకటించారు. మరో మూడు రోజులపాటు రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ కార్యాలయాల్లో తనిఖీలు జరుపుతామని తెలిపారు.

నామక్కల్ కవింజర్ మాళిగైలో బీటలు

పరుగులు తీసిన ఉద్యోగులు


భయాందోళనలతో భవనం బయటకు వచ్చిన ఉద్యోగులు


పగిలిన టైల్స్ తొలగిస్తున్న సిబ్బంది

చెన్నై, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సచివాలయం సమీపంలో ఉన్న నామక్కల్ కవింజర్ మాళిగైలో గురువారం ఉదయం మొదటి అంతస్థులో హఠాత్తుగా పెద్ద శబ్దంతో నేల బీటలు వారింది. దీంతో ఆ భవన సముదాయంలో పని చేస్తున్న వివిధ శాఖల ఉద్యోగులు ప్రాణభయంతో పరుగులు తీశారు. సెయింట్ జార్జి కోటలో సచివాలయాన్ని ఆనుకుని ఉన్న ఈ భవనంలో వివిధ ప్రభుత్వ శాఖల కార్యాలయాలున్నాయి. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం ఉద్యోగులు యథావిధిగా విధులకు హాజరయ్యారు. ఆ సమయంలో ఆ భవన మొదటి అంతస్థులోని వ్యవసాయ శాఖ కార్యాలయం వద్ద ఉన్నట్లు పెద్ద శబ్దం వినిపించింది. ఆ శబ్దంతోపాటు నేలపై పగుళ్లు కూడా ఏర్పడ్డాయి. దీంతో ఆ అంతస్థులో పనిచేస్తున్న ఉద్యోగులంతా కేకలు పెడుతూ గబగబా కిందకు దిగారు. దిగువ అంతస్థు ఫ్లోరింగ్ పూర్తిగా పగిలిందని భావించి పైఅంతస్థుల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, సిబ్బంది కూడా లిఫ్ట్‌లో, మెట్ల మీదుగా గబాగబా దిగారు. ఈ సమాచారం తెలుసుకున్న పోలీసు ఉన్నతాధికారులు, ప్రజాపనుల శాఖ అధికారులు హుటాహుటిన అక్కడికి చేరుకుని పరిశీలించారు. ఆ అంతస్థులోని నేలపై ఉన్న టైల్స్ ప్రాంతంలో ఏర్పడిన బీటల వల్లే పెద్ద శబ్దం వ్యాపించినట్లు కనుగొన్నారు. మొదటి అంతస్థు నేలపై టైల్స్ ముక్కలయ్యాయని, భవనంలో ఎక్కడా పగుళ్లు వ్యాపించలేదని అధికారులు చెప్పడంతో ఉద్యోగులు ఊరట చెందారు. మళ్ళీ ఆయా అంతస్థుల్లో పనిచేసే వివిధ ప్రభుత్వ శాఖల ఉద్యోగులు, సిబ్బంది విధులకు హాజరయ్యారు. నామక్కల్‌కవింజర్ మాళిగై భవనంలో బీటలు వారాయని, ఏ క్షణంలోనైనా కూలిపడుతుందని పుకార్లు వ్యాపించాయి. దీంతో సచివాలయం అంతటా తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. కొందరు ఉద్యోగులు, పనుల నిమిత్తం రాష్ట్రం నలుమూలల నుండి వచ్చిన ప్రజలు కూడా భీతిల్లారు. చాలా మంది సచివాలయం ప్రాంగణం విడిచి మెయిన్ గేటు సమీపానికి, ప్రధాన రహదారి ప్రాంతానికి చేరుకున్నారు. అరగంట తర్వాత ఆ భవనాన్ని ఎలాంటి ముప్పులేదని తెలిసిన తర్వాతే అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఈ సంఘటనపై సచివాలయ ఉద్యోగులు సంఘం అధ్యక్షుడు కె.వెంకటేశన్ మాట్లాడుతూ.. సెయింట్ జార్జి కోటను ఆనుకుని ఉన్న నామక్కల్ కవింజర్ మాళిగై పటిష్టతకు సంబంధించి అగ్నిమాపక దళం సర్టిఫికెట్ ఉందని, అయితే సచివాలయ భవన సముదాయం పటిష్టంగా ఉన్నట్లు అగ్నిమాపక శాఖ ఎలాంటి సర్టిఫికెట్ ఇవ్వలేదని చెప్పారు. ఈ రెండు భవనాలను అగ్నిమాపక శాఖ అధికారులు, ప్రజాపనుల శాఖ ఉన్నతాధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరుగకుండా చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

ఆ భవనానికి ధోకా లేదు : మంత్రి వేలు

ప్రజాపనుల శాఖ మంత్రి ఈవీ వేలు నామక్కల్ కవింజర్ మాళిగై మొదటి అంతస్థులో టైల్స్ వద్ద ఏర్పడిన బీటలను అధికారులతో కలిసి పరిశీలించారు. ఆ తర్వాత ఆయన మీడియాతో మాట్లాడుతూ... నామక్కల్ కవింజర్ మాళిగై పటిష్టంగానే ఉందని, ఆ భవన సముదాయంలో పేలుడు లాంటి శబ్దం వెలువడినట్లు సమాచారం తెలియగానే ప్రజాపనుల శాఖ సీనియర్ ఇంజనీర్లను రప్పించి పరిశీలన చేయించామని, భవన సముదాయానికి, గోడలకు ఎలాంటి ముప్పు వాటిల్లలేదని ధ్రువీకరించారని చెప్పారు. మొదటి అంతస్థులో 14 యేళ్ల క్రితం వేసిన పాత టైల్స్ వరుసగా ముక్కలయ్యాయని, అక్కడ నేల స్వల్పంగా బీటలు వారిందని మంత్రి వేలు చెప్పారు.



'సీఎం కప్ 2024' పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన చెన్నై జిల్లా జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న ముఖ్యమంత్రి

పురోభివృద్ధిలో క్రీడా రంగం

● సీఎం స్టాలిన్

పెరంబూర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): దేశంలోనే క్రీడారంగంలో తమిళనాడు పురోగతిలో ఉందని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ తెలిపారు. పెరియమేడులోని నెహ్రూ స్టేడియంలో జరుగుతున్న 'ముఖ్యమంత్రి ట్రోఫీ-2024' క్రీడల ముగింపు వేడుకలు గురువారం సాయంత్రం జరిగాయి. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి, క్రీడాభివృద్ధి, యువజన సంక్షేమ శాఖ మంత్రి ఉదయనిధి సహా మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోటీల్లో ఛాంపియన్‌గా నిలిచిన చెన్నై జిల్లా జట్టుకు ముఖ్యమంత్రి స్టాలిన్ ఛాంపియన్ ట్రోఫీ అందజేశారు. ఈ సందర్భంగా స్టాలిన్ మాట్లాడుతూ... ఒకప్పుడు క్రీడలను ఒక సరదాగా ఆడేవారని, ప్రస్తుతం ఆ రంగంలోనే రాణిస్తూ ఉన్నత పదవులు చేపట్టిన వారు ఉన్నారన్నారు. విద్యార్థుల్లో క్రీడల పట్ల ఆసక్తి పెంచేలా ముఖ్యమంత్రి ట్రోఫీ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. పాఠశాల, జిల్లా, రాష్ట్రస్థాయిలో పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్రంలో క్రీడాకారులు పుష్కలంగా ఉన్నారని, తగిన ప్రోత్సాహం లేకపోవడంతో పలువురు క్రీడలకు దూరమవుతున్నారని తెలిపారు. తాము అధికారం చేపట్టిన వెంటనే క్రీడారంగ అభివృద్ధికి చర్యలు చేపట్టామన్నారు. ఈ శాఖ మంత్రి ఉదయనిధి కృషితో దేశంలోనే రాష్ట్రం క్రీడారంగంలో పురోగతి సాధించిందని సీఎం ప్రశంసించారు. కార్యక్రమంలో మంత్రి ఉదయనిధి మాట్లాడుతూ... క్రీడలకు పేదరికం అడ్డుకారాదన్నారు. దీనిని పరిగణలోకి తీసుకొని పేద కుటుంబాలకు చెందిన క్రీడాకారులకు ప్రోత్సాహక నిధులు అందిస్తూ వారు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా చర్యలు చేపట్టామని తెలిపారు. విద్య, ఉద్యోగాల్లో క్రీడాకారులకు రిజర్వేషన్, ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించేలా చర్యలు చేపట్టామని మంత్రి ఉదయనిధి తెలిపారు.

ప్రథమస్థానంలో చెన్నై జిల్లా....

ముఖ్యమంత్రి ట్రోఫీ పోటీల్లో చెన్నై జిల్లా 105 బంగారు పతకాలు సహా మొత్తం 254 పతకాలతో మొదటి స్థానంలో నిలిచింది. 31 బంగారు సహా 93 పతకాలతో చెంగల్పట్టు జిల్లా రెండో స్థానం, 23 బంగారు సహా 102 పతకాలతో కోయంబత్తూర్ జిల్లా మూడవ స్థానంలో నిలిచాయి.

ఓటరు జాబితా సవరణపై

అఖిలపక్ష నేతలతో ఈసీ భేటీ


రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమైన ఎన్నికల ప్రధానాధికారి సత్యప్రదసాహు

ప్యారీస్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఓటరు జాబితా సవరణపై రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రధానాధికారి సత్యప్రదసాహు గురువారం ఎన్నికల సంఘం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమయ్యారు.ఓటరు జాబితా సవరణకు అనుకూలంగా ముసాయిదా ఓటరు జాబితాను ఈ నెల 29న విడుదల చేయనున్న నేపథ్యంలో, సచివాలయ ప్రాంగణంలోని రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రధాన కార్యాలయంలో జరిగిన సమావేశం సుమారు గంటన్నరపాటు సాగింది. ఇందులో ఈసీ నుంచి ఆహ్వానం పొందిన అధికార డీఎంకే, ప్రతిపక్ష అన్నాడీఎంకే, కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీ, ఆమ్ ఆద్మీ, సీపీఎం, సీపీఐ, డీఎండీకే పార్టీల తరఫున ఇద్దరేసి ప్రతినిధులు పాల్గొన్నారు. సమావేశంలో ఎన్నికల ప్రధానాధికారి సత్యప్రదసాహు రాజకీయ పార్టీలకు కొన్ని సూచనలిచ్చారు. ముసాయిదా ఓటరు జాబితా సవరణ సమయంలో చేపట్టాల్సిన నిబంధనలు, రాష్ట్రవ్యాప్తంగా ఓటర్ల కోసం ఏర్పాటుచేయనున్న ప్రత్యేక శిబిరాల్లో కల్పించాల్సిన వసతులు తదితరాల అంశాలపై ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ నెల 29న ముసాయిదా ఓటరు జాబితాను విడుదల చేయనున్నట్లు తెలిపారు. ఆ జాబితాలో కొత్త ఓటర్ల చేరిక, మరణించిన వారి పేర్ల తొలగింపు తదితర వివరాలను నవంబరు 28వ తేది వరకు సంబంధిత ఎన్నికల అధికారుల వద్ద సమర్పించవచ్చని తెలిపారు. నవంబరులో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుకానున్న ప్రాంతాల్లో నాలుగు ప్రత్యేక ఓటరు శిబిరాలు నిర్వహించనున్నామని, వీటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ శిబిరాల్లో స్వీకరించే వినతులపై డిసెంబరు 24 లోగా ఎన్నికల సంఘం నిర్ణయం తీసుకుంటుందని, ఇక తుది ఓటరు జాబితా 2025 జనవరి 6వ తేది విడుదల చేయనున్నట్లు సత్యప్రద సాహు తెలిపారు.

ఘనంగా వైద్య వర్సిటీ స్నాతకోత్సవం

● ఆరోగ్య శాఖ మంత్రి గైర్హాజరు
● డిగ్రీలు అందజేసిన గవర్నర్ రవి


గవర్నర్‌తో డిగ్రీలు అందుకున్న విద్యార్థులు

అడయార్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక గిండిలోని డాక్టర్ ఎంజీఆర్ వైద్య విశ్వవిద్యాలయం 37వ స్నాతకోత్సవం గురువారం నిర్వహించగా, వీటికి రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖా మంత్రి ఎం.సుబ్రమణ్యం గైర్హాజరవడం చర్చనీయాంశమైంది. అయితే చాన్సలర్ హోదాలో గవర్నర్ ఆర్ఎన్ రవి పాల్గొని విద్యార్థులకు బంగారు పతకాలతో పాటు స్నాతకోత్సవ డిగ్రీలను అందజేశారు. ఈ స్నాతకోత్సవంలో గవర్నర్ రవితో పాటు ఆరోగ్య మంత్రి సుబ్రమణ్యం, మరి కొందరు ప్రముఖులు పాల్గొంటారని ఆహ్వాన పత్రికల్లో ముద్రించారు. కానీ, ఆరోగ్య శాఖ మంత్రి ఈ వేడుకలకు దూరంగా ఉన్నారు. ఈ స్నాతకోత్సవంలో 5,371 మంది వైద్య విద్యార్థులు, 1,485 మంది దంత వైద్యులు, 2,055 మంది భారతీయ సంప్రదాయ వైద్యం విద్యార్థులు, 26,882 మంది పారా మెడికల్ కోర్సు విద్యార్థులతో కలిపి మొత్తం 35,793 మంది డిగ్రీలు అందుకున్నారు. అలాగే, విశ్వవిద్యాలయం స్థాయిలో అధిక మార్కులు సాధించిన 96 మంది విద్యార్థులతో పాటు మొత్తం 142 మందికి గవర్నర్ బంగారు పతకాలను బహూకరించారు. కాగా, నగరంలోని ప్రభుత్వ స్టాన్లీ వైద్య కాలేజీకి చెందిన శ్రీరామ్ ఆనంద్ ఏకంగా 9 పతకాలను, మద్రాస్ వైద్య కాలేజీకి చెందిన సుర్జిత్ నందా 7 పతకాలను అందుకున్నారు.

స్నాతకోత్సవాన్ని మంత్రులు బహిష్కరించడమా ?

● బీజేపీ రాష్ట్ర మాజీ చీఫ్ తమిళిసై

ప్యారీస్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): విశ్వవిద్యాలయాల స్నాతకోత్సవాల్లో ఛాన్సలర్ హోదాలో రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవి పాల్గొనే కార్యక్రమాలను మంత్రులు బహిష్కరించడం మంచిది కాదని బీజేపీ రాష్ట్ర మాజీ అధ్యక్షురాలు తమిళిసై సౌందర్‌రాజన్ అభిప్రాయపడ్డారు. స్వాతంత్ర్య సమరయోధులు మరుదు సోదరుల వర్ధంతిని పురస్కరించుకుని గిండిలో ఉన్న గాంధీ మండపం ప్రాంగణంలోని వారి విగ్రహాలకు గురువారం బీజేపీ తరఫున తమిళిసై నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ... స్వాతంత్ర్య సమరంలో మరుదు సోదరుల పాత్ర గొప్పదని అయితే వారికి రాష్ట్రంలో తగిన గుర్తింపు లేదన్నారు. మనస్పర్థల కారణంగా గవర్నర్ పాల్గొనే కార్యక్రమాల్లో అధికార పార్టీకి చెందిన నేతలు గైర్హాజరు కావడం తప్పులేదని అయితే, యూనివర్సిటీల స్నాతకోత్సవాల్లో ఉన్నత విద్యాశాఖ మంత్రి, ఇతర మంత్రులు పాల్గొనకపోవడం మంచి సంప్రదాయం కాదన్నారు. కేంద్ర ప్రభుత్వ కొత్త విద్యా విధానం, త్రిభాషా సిద్ధాంతం, వైస్ చాన్సలర్ల నియామకాలను కూడా కొంతమంది రాజకీయం చేస్తున్నారని ఆమె తెలిపారు.

రాష్ట్రవ్యాప్తంగా

6,585 బాణసంచా దుకాణాలకు అనుమతి

పెరంబూర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా 6,585 తాత్కాలిక బాణసంచా దుకాణాలకు అనుమతిచ్చినట్లు అగ్నిమాపక శాఖ తెలిపింది. ఈ నెల 31న దీపావళి పండుగ సందర్భంగా టపాసుల దుకాణాల ఏర్పాటుకు 9,177 దరఖాస్తులందాయి. దుకాణాలు ఏర్పాటుచేసే స్థలం, వసతులు, భద్రతా ఏర్పాట్లు తదితరాలను అధికారులు పరిశీలిస్తున్నారు. ఆ ప్రకారం, బుధవారం వరకు 6,585 దుకాణాలకు అనుమతులిచ్చారు. 1,911 దరఖాస్తులు పరిశీలనలో ఉండగా, 681 దరఖాస్తులు తిరస్కరించినట్లు అగ్నిమాపక శాఖ తెలిపింది. కాగా, గత ఏడాది టపాసుల దుకాణాల ఏర్పాటుకు 8,000 దరఖాస్తులు రాగా, 7,200 దుకాణాలను అనుమతించారు.


టపాసులు కొనుగోలు చేస్తున్న దృశ్యం

సమాచార దర్శిని

30 వరకు ఐటీఐలలో అడ్మిషన్లు

పెరంబూర్,అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉద్యోగావకాశాలు, శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో 102 ప్రభుత్వ, 311 ప్రైవేటు వృత్తి శిక్షణా కేంద్రాలున్నాయి.ఈఐటీఐలలో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించిన అడ్మిషన్లు ఈ నెల 30వతేది వరకు పొడిగించారు. ఈ కోర్సులకు ఎలాంటిఫీజు వసూలుచేయరు. కోర్సుల్లో చేరిన వారికి నెలకు రూ.750 ప్రోత్సాహక రుసుము,ఉచిత బస్‌పాస్, సైకిల్, యూనిఫాం, షూ తదితరాలు అందజేయనున్నారు. మరిన్ని వివరాలకు 9499055689 అనే నెంబరు సంప్రదించవచ్చని ఉద్యోగ అవకాశాలు, శిక్షణ శాఖ డైరెక్టరేట్ ప్రకటనలో తెలిపింది.

అల్లం కిలో రూ.200

పెరంబూర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అవసరాలకు కర్ణాటక నుంచి అధికంగా అల్లం దిగుమతి చేసుకుంటున్నారు. ప్రస్తుతం ఆ రాష్ట్రంలో కురుస్తున్న వర్షాల కారణంగా అల్లం దిగుబడి గణనీయంగా తగ్గింది. పండుగ సీజన్ కావడంతో అల్లం అవసరాలకు పెరిగాయి. దీంతో అల్లం ధరలు కూడా పెరిగాయి. కోయంబేడు మార్కెట్లో అల్లం కిలో రూ.200 వరకు విక్రయమవుతోంది. జనవరి నెల తర్వాత అల్లం ధరలు క్రమంగా తగ్గే అవకాశముందని వ్యాపారులు తెలిపారు.

ఆదివారం పనిచేయనున్న రేషన్ దుకాణాలు

పెరంబూర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగను పురస్కరించుకొని 27వ తేదీ,ఆదివారం రేషన్ దుకాణాలు పనిచేస్తామని సహకార శాఖ మంత్రి పెరియకరుప్పన్ తెలిపారు. ఈ ఏడాది దీపావళి పండుగ సందర్భంగా ప్రజలకు నిత్యావసర సరుకులు అందించేందుకు ఈ నెల 27వ తేది రేషన్ దుకాణాలు పనిచేస్తాయని మంత్రి తెలిపారు.

దీపావళికి విమాన ఛార్జీల్లో రాయితీ

ప్యారీస్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ సందర్భంగా విమాన ఛార్జీల్లో రాయితీ కల్పిస్తున్నట్లు ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ సంస్థ ప్రకటించింది. చెన్నై-బెంగళూరు, కొచ్చిన్-బెంగళూరు, గౌహతి-అగర్తలా, విజయవాడ-హైదరాబాద్ తదితర మార్గాల్లో ప్రయాణం చేసేందుకు ఈ నెల 27వ తేది వరకు టిక్కెట్లు రిజర్వ్ చేసుకున్న వారికి రాయితీ కింద రూ.1,606 ఛార్జీగా నిర్ణయించింది. ఎయిర్ ఇండియా వెబ్‌సైట్ ద్వారా టిక్కెట్లు రిజర్వేషన్ చేసుకున్న వారికి రూ.1,456 ఛార్జీ నిర్ణయించింది. నవంబరు 1 నుంచి డిసెంబరు 10వ తేది వరకు 40 రోజుల్లో ఏ రోజైనా ఈ రాయితీతో ప్రయాణం చేయవచ్చు. ఒక్కొక్క ప్రయాణికుడు మూడు కిలోల లగేజీ తీసుకెళ్లొచ్చు. 15 కిలోలకు పైగా వస్తువులు తీసుకెళ్లేందుకు రూ.1,000 చొప్పున ఛార్జీ చెల్లించాల్సి ఉంటుంది.

చెత్త వేసిన వారి నుంచి రూ.18 లక్షల జరిమానా

పెరంబూర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): నగరంలో నిబంధనలు అతిక్రమించి బహిరంగ ప్రాంతాల్లో చెత్త వేసిన వారి నుంచి రూ.18 లక్షల జరిమానా వసూలుచేసినట్లు గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) ఒక ప్రకటనలో తెలిపింది. రోడ్లు, బహిరంగ ప్రాంతాల్లో చెత్త, భవన నిర్మాణ వ్యర్థాలు వేసే వారికి రూ.1,000 నుంచి రూ.5,000 వరకు జరిమానా విధించనున్నట్లు ప్రకటించిన కార్పొరేషన్, ఈ నిబంధన సక్రమంగా అమలయ్యేలా ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టింది. ఈ ప్రకారం, నగరంలో బహిరంగ ప్రాంతాల్లో చెత్త వేసిన వారి నుంచి 15 రోజుల్లో రూ.17.96 లక్షల జరిమానా వసూలుచేశారు. అందులో అధికంగా కోడంబాక్కం మండలంలో రూ.2,25,500 జరిమానా వసూలు చేసినట్లు జీసీసీ తెలిపింది.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెరంబూర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా దిగువ ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

ప్రభుత్వ ఎస్టేట్: వాలాజా రోడ్డు, ట్రిప్లికేన్ హైరోడ్డు, ఎల్లీస్ రోడ్డు, ఎల్లీస్ పురం, అన్నాస్వామి వీధి, తయార్‌సాహిబ్ వీధి, బంగారు నాయకన్ వీధి, బాలముత్తు వీధి, చిన్నతంబి వీధి, ముక్తర్‌నిషా బేగం వీధి, నారాయణ నాయకన్ వీధి, నాగప్పన్ వీధి, కితాబత్తన్ బహదూర్ వీధి, బాబర్‌ఖాన్ వీధి, వల్లభ అగ్రహారం వీధి, అప్పావు వీధి, ఉస్నీన్ అలి వీధి, మేయర్ చిట్టిబాబు వీధి, గులాం వీధి, అవులియా సాహిబ్ వీధి, దౌలత్తన్ వీధి, వెంకటాచలం వీధి, మసీదు వీధి, లాక్ నగర్, కలైంవానర్ అరంగం, ప్రజాపనుల శాఖ, మద్రాసు విశ్వవిద్యాలయం, కామరాజర్ రోడ్డు.

కంచిలో 8 సీఎన్‌జీ కేంద్రాలు

చెన్నై, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కాంచిపురంలో ఈ ఏడాది చివరి నాటికి 8 సీఎన్‌జీ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు దేశంలోని సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ (సీజీడీ) ఏజీ అండ్‌పీ ప్రథమ్ ప్రకటించింది. ఆ సంస్థ రీజనల్ హెడ్ ఎన్‌టీ తిరుక్కుమరన్, ఆపరేషన్స్ విభాగ చీఫ్ మేనేజర్ రమిత్ మన్, ఏజీఎం అళగురాజన్, తదితరులు గురువారం మీడియాకు వెల్లడించారు. కొత్త కేంద్రాలతో మొత్తం సంఖ్య 50కి చేరుతుందని వివరించారు. కాంచీపురం, చెంగల్పట్టు జిల్లాలను మరింత పర్యావరణ అనుకూలమైన, ఆర్థిక లాభదాయకమైన ప్రాంతాలుగా మార్చడానికి తాము ప్రయత్నిస్తున్నట్లు వివరించారు.



వేలూరు కాట్పాడి వంతెనపై గుంతను పూడ్చిన ట్రాఫిక్ ఎస్ఐ గోవిందస్వామి, హెడ్ కానిస్టేబుల్ కార్తికేయన్‌లకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న ఎస్పీ మదివానన్

టి.నగర్ ఫ్లై ఓవర్‌పై పార్కింగ్

● 70 కార్లు, 2,000 బైక్ నిలిపే సదుపాయం



పార్కింగ్ ఏర్పాట్లలో కార్పొరేషన్ సిబ్బంది

పెరంబూర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక టినగర్‌లో మెట్రో రైల్ , ఫ్లై ఓవర్ నిర్మాణ పనుల కారణంగా ట్రాఫిక్ మార్పులు చోటుచేసుకున్నాయి. ఈ కారణంగా టి.నగర్, పాండి బజార్‌లో పీక్ అవర్స్‌లో ట్రాఫిక్ రద్దీ అధికంగా ఉంటోంది. దీపావళి సందర్భంగా కొత్త బట్టలు, స్వీట్లు కొనుగోలుకు ప్రజలు పెద్దసంఖ్యలో వస్తుండడం,ఈప్రాంతంలో పార్కింగ్ సదుపాయం లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీపావళి పండుగకు ఇంకా వారం రోజులే ఉండడంతో ప్రజలు రద్దీ పెరుగుతోంది. ఈ నేపథ్యంలో, ప్రజల వాహనాలు నిలిపేందుకు ఫ్లై ఓవర్ నిర్మాణ పనుల కారణంగా నిషేధించిన ఉస్మాన్ రోడ్డు ఫ్లై ఓవర్‌ను వాహనాల పార్కింగ్‌కు అనుమతించాలని కార్పొరేషన్, పోలీసు శాఖలు నిర్ణయించాయి. ఈ విషయమై ట్రాఫిక్ అసిస్టెంట్ కమిషనర్ రాజా మాట్లాడుతూ... ఉస్మాన్ రోడ్డు ఫ్లై ఓవర్‌పై వాహనాలు నిలిపేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ ఫ్లై ఓవర్ ఇరువైపులా 70 కార్లు, 2,000 ద్విచక్ర వాహనాలు నిలిపే సదు పాయం ఉందన్నారు. గురువారం నుంచి ఈ పార్కింగ్ అందుబాటులోకి వచ్చిందని తెలిపారు. ప్రైవేటు పాఠశాలలను కూడా సంప్రదించామని, శని, ఆదివారాల్లో ప్రైవేటు పాఠశాల ప్రాంగణాల్లో వాహనాలు నిలిపేలా చర్యలు చేపట్టామన్నారు. ఏఏ ప్రాంతాల్లో పార్కింగ్ సదుపాయం ఉందో వాహనచోదకులు తెలుసుకొనేలా టి.నగర్, పాండి బజార్‌లలో ప్రకటనా బోర్డులు ఏర్పాటుచేసినట్లు అసిస్టెంట్ కమిషనర్ తెలిపారు.

ఇక నుంచి రేషన్ దుకాణాల్లో 'ఖాతా'

● పొదుపు డిపాజిట్, విత్‌డ్రా చేసుకొనే అవకాశం



పెరంబూర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రేషన్ దుకాణాల ద్వారా ప్రజలకు బ్యాంకింగ్ సేవలు అందించేలా సహకార బ్యాంక్‌ల్లో పొదుపు ఖాతాలు ప్రారంభించాలని సహకార శాఖ మండల జాయింట్ రిజిస్ట్రార్లకు సహకార శాఖ ఉత్తర్వులు జారీచేసింది. ఈ విషయమై సహకార సంఘాల రిజిస్ట్రార్ సుబ్బయ్యన్, మండల జాయింట్ రిజిస్ట్రార్లకు పంపిన ఉత్తర్వుల్లో.. కేంద్ర సహకార బ్యాంకుల ద్వారా ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లో రైతులకు పంట రుణం సహా పలు రకాల రుణ సహాయాలు అందజేస్తున్నారు. 2023లో 18.36 లక్షల మంది రైతులకు రూ.15,500 కోట్ల పంట రుణాలు అందజేశారు. యువతను ఆకర్షించేలా కొత్త బ్యాంకింగ్ పథకాలు రూపొందించి సహకార సంఘాల సభ్యత్వంలో చేర్పించేలా చర్యలు చేపట్టారు. అన్ని వర్గాలను కలుపుకొని బ్యాంక్ అందించే సేవలు, ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరేలా కేంద్ర సహకార బ్యాంక్‌ల కార్యకలాపాలు ఉండాలి.

కార్డుదారులకు బ్యాంకింగ్ సేవలు..

సహకార బ్యాంకుల్లో వినియోగదారుల సరాసరి వయస్సు 53 ఏళ్లుగా ఉంది. సహకార సంఘాల ద్వారా నడుపుతున్న రేషన్ దుకాణాల్లో సరుకులు తీసుకొనే కార్డుదారులకు, పలుశాఖల సహాయాలు రేషన్ దుకాణాల ద్వారా అందజేస్తున్నారు. సహకార రేషన్‌దుకాణాల ద్వారా సహకార బ్యాంకుల్లో పొదుపు, పరపతి సేవలు అందేలా ఆ ప్రాంతాల్లోని కేంద్ర సహకార బ్యాంకు శాఖల్లో పొదుపు ఖాతాలు ప్రారంభించేలా చర్యలు చేపట్టాలి. అన్ని రేషన్ దుకాణాల్లో కేంద్ర సహకార బ్యాంకు పొదుపు పథకాలు, ఫిక్స్‌డ్ డిపాజిట్ పథకాలు, రుణాలు అందించే ప్రక్రియ, పొదుపు ఖాతా, ఏటీఎం కార్డు తదితరాలతో కూడిన హ్యాండ్ బుక్ అందుబాటులో ఉంచుకొని, ప్రజలు పొదుపు ఖాతాలు ప్రారంభించేలా దరఖాస్తులు అందజేయాలి. ఈ ఖాతాలు ప్రారంభించేలా కృషిచేసిన సిబ్బందికి ఒక ఖాతాకు రూ.5 ప్రోత్సాహకంగా అందించాలని సహకార శాఖ సర్క్యులర్‌లో పేర్కొంది.

నొచ్చికుప్పం జాలర్ల సమ్మె కొనసాగింపు

ప్యారీస్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక మెరీనా బీచ్ లూప్ రోడ్డులో తొలగించిన చేపల దుకాణాలకు మళ్లీ అనుమతించాలని కోరుతూ నొచ్చికుప్పం జాలర్లు చేపట్టిన సమ్మె గురువారం నాలుగో రోజుకు చేరుకుంది. మెరీనా బీచ్ తీరప్రాంతాన్ని సుందరంగా తీర్చిదిద్దే పనులను జీసీసీ చేపట్టింది. ఇందులో భాగంగా మెరీనా లూప్ రోడ్డులో వాహన రాకపోకలకు అంతరాయంగా ఉన్న చేపల దుకాణాలను ఇటీవల తొలగించింది. దీనికి నిరసనగా సుమారు 500 మందికి పైగా జాలర్లు ఈ నెల 21వ తేది నుంచి చేపల వేట బహిష్కరించి సమ్మె బాట పట్టారు.

ఈపీఎస్ స్నేహితుడి విద్యాసంస్థల్లో కొనసాగుతున్న ఐటీ తనిఖీలు

ప్యారీస్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి స్నేహితుడు ఇళంగోవన్ నిర్వహిస్తున్న ఎంఐటీ విద్యాసంస్థల్లో ఆదాయపు పన్ను శాఖ అధికారులు మూడో రోజైన గురువారం కూడా తనిఖీలు నిర్వహించారు. ఇళంగోవన్ గత అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో రాష్ట్ర సహకార సంఘాల చైర్మన్‌గా వ్యవహరించి స్వామి అయ్యప్పన్ ట్రస్ట్ పేరుతో తిరుచ్చి జిల్లా ముసిరి సమీపంలో ఎంఐటీ విద్యాసంస్థలు నిర్వహిస్తున్నారు. ఈ విద్యాసంస్థలు సక్రమంగా పన్ను చెల్లించలేదనే కారణంగా సుమారు 10 మందికి పైగా ఐటీ అధికారులు ఇళంగోవన్ చెందిన ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, పాలిటెక్నిక్ కళాశాల, బోధి విద్యాలయం సంస్థల్లో నిర్వహించిన తనిఖీల్లో కీలక పత్రాలు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.

జోరుగా మేకల విక్రయాలు



కోడియూర్ సంతలో విక్రయానికి ఉంచిన మేకలు

వేలూరు, అక్టోబరు 24: దీపావళి పండుగను పురస్కరించుకొని మేకలు విక్రయాలు ఊపందుకున్నాయి. జోలార్‌పేట సమీపం కోడియూర్ సంత మైదానంలో ఆంధ్రా, కర్ణాటక తదితర రాష్ట్రాలతో పాటు పలు జిల్లాల నుంచి మేకలు విక్రయానికి తెస్తుంటాయి. ఈ సంతలో రూ.3 వేల నుంచి రూ.25 వేలకు మేకలు ధర పలికాయి. మంచి ధర పలుకడంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు.

రాపిడో, ఓలా బైక్‌లు అడ్డుకోవాలి



ర్యాలీగా వస్తున్న ఆటో డ్రైవర్లు

వేలూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రాపిడో, ఓలా తదితర ప్రైవేటు బైక్ సేవలు అడ్డుకోవాలని కోరుతూ ఆటో డ్రైవర్లు కలెక్టర్ సుబ్బులక్ష్మికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆటో కార్మికులు మాట్లాడుతూ... ఆటో నడిపితేనే తమ కుటుంబాలు జీవనం సాగించే పరిస్థితి ఉందన్నారు. కానీ, ప్రైవేటు సంస్థల ద్విచక్రవాహన టాక్సీతో తాము ఆదాయం కోల్పోయామన్నారు. ఆటో కార్మికులను ఆదుకొనేలా ప్రైవేటు బైక్‌లను నిషేధం విధించేలా చర్యలు చేపట్టాలని ఆటో డ్రైవర్లు పేర్కొన్నారు. ఆటో డ్రైవర్లు తమ వాహనాలతో కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు.

బెంగళూరు ఘటనలో మృతిచెందిన వారి కుటుంబాలకు ఆర్థికసాయం

పెరంబూర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్రం బెంగళూరు హెన్నూర్‌లో ఈ నెల 22వ తేది మధ్యాహ్నం కురిసిన భారీ వర్షాల కారణంగా నిర్మాణం ఉన్న అపార్ట్ మెంట్ భవనం కూలిన ఘటనలో 8 మంది మృతిచెందారు. మృతుల్లో కళ్లకుర్చి జిల్లాకు చెందిన మణికంఠన్, సత్యరాజ్ కూడా ఉన్నారు. ఉపాధి కోసం బెంగళూరుకు వెళ్లి రాష్ట్రానికి చెందిన ఇద్దరు మృతిచెందడడంపై ముఖ్యమంత్రి స్టాలిన్ దిగ్ర్భాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలుపడంతో పాటు మృతుల కుటుంబాలకు తలా రూ.2 లక్షల ఆర్థికసాయం అందజేస్తున్నట్లు సీఎం స్టాలిన్ ప్రకటించారు.



వేలూరు జిల్లా సమాచార శాఖ ఆధ్వర్యంలో గుడియాత్తం తాలూకా మేల్‌అలత్తూర్‌లో గురువారం ఏర్పాటుచేసిన ప్రభుత్వ పథకాల ఎగ్జిబిషన్ తిలకిస్తున్న ప్రజలు

పని చేయని సిగ్నల్ కొరుక్కుపేట వద్ద ఆగిన సబర్బన్ రైళ్లు



ఆగిన రైళ్లు

ప్యారీస్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): సిగ్నల్ మొరాయించడంతో స్థానిక కొరుకుపేట వద్ద పలు సబర్బన్ రైళ్లు నిలిచిపోయాయి. తిరువళ్లూర్ జిల్లా గుమ్మిడిపూండి నుంచి చెన్నై సెంట్రల్ రైల్వేస్టేషన్‌కు గురువారం ఉదయం బయల్దేరిన సబర్బన్ రైలు ఉదయం 9.30 గంటల ప్రాంతంలో కొరుక్కుపేట రైల్వేస్టేషన్ సమీపంలోకి చేరుకుంది. ఆ సమయంలో బేసిన్ బ్రిడ్జి-కొరుక్కుపేటల మధ్య రైలుమార్గంలో ఉన్న సిగ్నళ్లు మొరాయించాయి. దీంతో, సబర్బన్ రైళ్లను మార్గ మధ్యంలోనే నిలిపివేశారు. సమాచారం తెలిసి అక్కడకు చేరుకున్న రైల్వే అధికారులు, సిగ్నళ్లను సరిచేయడంతో మళ్లీ రైళ్ల రాకపోకలు యధావిధిగా సాగాయి.

బ్రహ్మాజ్ఞాన సంఘం నూతన కమిటీ ఎన్నిక



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నాగప్పన్

వేలూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక కాట్పాడి గాంధీ నగర్‌లో గురువారం బ్రహ్మాజ్ఞాన సంఘం జనరల్ బాడీ సమావేశం జరిగింది. సంఘ కార్యాలయంలో జరిగిన సమావేశానికి అధ్యక్షుడు నాగప్పన్ అధ్యక్షత వహించారు. గత ఏడాది ఆదాయ, వ్యయాల వివరాలను కోశాధికారి రాజేంద్రన్ వివరించారు. అనంతరం తమిళనాడు బ్రహ్మాజ్ఞాని అనే పుస్తకాన్ని అధ్యక్షుడు నాగప్పన్ ఆవిష్కరించగా, సభ్యులు జనార్ధనన్, పళని, మాజీ సబ్ కలెక్టర్ నటేశణ్ తదితరులు అందుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ ఎన్నిక జరిగింది. అధ్యక్షుడిగా నాగప్పన్, సెక్రటరీగా రామన్, కోశాధికారిగా మునివేలన్, సభ్యులుగా ఎస్.రాజేంద్రన్, సుకుమార్, తిరునావుక్కరసు, మూర్తి తదితరులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు నిర్వాహకులు తెలిపారు.

కోర్టుకు హాజరైన మంత్రి సెంథిల్ బాలాజి

ప్యారీస్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రవాణా శాఖలో ఉద్యోగాల పేరుతో మోసం చేశారనే కేసులో మంత్రి సెంథిల్ బాలాజి నగరంలో ఎంపీ, ఎమ్మెల్యేల ప్రత్యేక కోర్టులో గురువారం హాజరయ్యారు. 2011 నుంచి 2015 వరకు అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో రవాణా శాఖ మంత్రిగా సెంథిల్ బాలాజీ వ్యవహరించారు. అప్పుడు ఆ శాఖలో ఉద్యోగాల పేరుతో పలువురిని మోసం చేసినట్లు కేంద్ర ఆర్థిక నేర విభాగం పోలీసులు ఆయనపై కేసు నమోదుచేశారు. ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి సంజయ్‌బాబా సమక్షంలో గురువారం ఈ కేసు విచారణకు రాగా, మంత్రి సెంథిల్ బాలాజి సహా పలువురు హాజరయ్యారు.

బాణసంచా ప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన



ప్రాథమిక చికిత్సా విధానం చూపిస్తున్న డాక్టర్ వాసుమతి

పెరంబూర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి: రాధాత్రి నేత్రాలయం ఆధ్వర్యంలో బాణసంచా ప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. స్థానిక టినగర్‌లోని హిందీ ప్రచార సభ ప్రాంగణంలో గురువారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో రాధాత్రి నేత్రాలయం మెడికల్ డైరెక్టర్ డా.వాసుమతి వేదాంతం ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ... దీపావళి పండుగ సందర్భంగా పిల్లలు టపాసులు కాల్చే సమయంలో పెద్దలు తప్పకుండా వెంట ఉండాలన్నారు. పెద్ద శబ్దం లేకుండా రంగురంగులుగా పేలే టపాసులతో కళ్లు అధికంగా దెబ్బతినే అవకాశముందన్నారు. ఒక్కో సమయాల్లో ఈ ప్రమాదాల్లో కంటి చూపు కోల్పోయే ప్రమాదం కూడా ఉందన్నారు. అందువల్ల బాణసంచా కాల్చే సమయంలో తగిన భద్రతా చర్యలు చేపట్టాలని ఆమె విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో భాగంగా, బాణసంచా ప్రమాదంలో కంటికి గాయాలు ఏర్పడితే వాటికి ప్రాథమిక చికిత్సలు అందించే విధానాలను డా.వాసుమతి చేసి చూపించారు. కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులకు ఫస్ట్ ఎయిడ్ బాక్స్‌లు అందించారు.

వేళచ్చేరి రైల్వేస్టేషన్‌కు బాంబు బెదిరింపు

● వృద్ధుడి అరెస్టు

పెరంబూర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక వేళచ్చేరి రైల్వే స్టేషన్‌కు బాంబు బెదిరింపులకు పాల్పడిన వృద్ధుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ నెల 22న పోలీస్ కంట్రోల్ రూమ్‌కు ఫోన్ చేసిన గుర్తుతెలియని వ్యక్తి, వేళచ్చేరి రైల్వేస్టేషన్‌లో బాంబులుంచినట్లు చెప్పి ఫోన్ కట్ చేశాడు. దీంతో, బాంబ్ స్క్వాడ్, పోలీసుల జాగిలాలతో రైల్వేస్టేషన్ కు చేరుకున్న పోలీసులు క్షుణ్ణంగా తనిఖీ చేసి, బాంబు బెదిరింపు ఫేక్ కాల్‌గా నిర్ధారించారు. ఈ వ్యవహారంలో ఫోన్ నెంబరు ఆధారంగా విచారణ చేపట్టిన పోలీసులు, అరియలూరు జిల్లా తిరుమళపాడి గ్రామానికి చెందిన జ్యోతివేల్ (62) బాంబు బెదిరింపుకు పాల్పడినట్లు గుర్తించారు. 18 ఏళ్ల క్రితం భార్యను హత్య చేసిన కేసులో అరెస్టయి ఇటీవల విడుదలైనట్లు, అందువల్ల అతడిని బంధువులు రానివ్వలేదని తెలిసింది. అదే సమయంలో స్వయంగా వ్యాపారం చేసుకొనేందుకు ఆర్థికసాయం కోరుతూ కలెక్టర్‌కు పలుమార్లు విజ్ఞప్తి చేసినా ఫలితం లేకపోయిందని, దీంతో విసిగిపోయిన జ్యోతివేల్ బాంబు బెదిరింపులకు పాల్పడినట్లు, ప్రస్తుతం అతని మానసిక స్థితి సరిగ్గా లేదని గుర్తించిన పోలీసులు, అతనిని హెచ్చరించి పంపారు.

మంత్రి దురైమురుగన్‌కు అస్వస్థత

చెన్నై, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నీటివనరుల శాఖ మంత్రి దురైమురుగన్ ఆకస్మికంగా తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. చికిత్స నిమిత్తం వేలూరులోని ప్రైవేటు ఆస్పత్రిలో చేరారు. గురువారం సాయంత్రం చెన్నై బయలుదేరుతుండగా ఉన్నట్టుండి అస్వస్థతకు గురయ్యారు. వెంటనే ఆయనను ఆసుపత్రికి తరలించి చికిత్సలందిస్తున్నారు.

జలాశయాల ఆక్రమణలు తొలగించండి

● మద్రాసు హైకోర్టు

పెరంబూర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): జలాశయాల ఆక్రమణలు చోళుల కాలానికి చెందినవైనా వాటిని వెంటనే తొలగించాలని మద్రాసు హైకోర్టు స్పష్టం చేసింది. తిరువేర్కాడులోని కోలడి చెరువు ఆక్రమించి ఇళ్లు నిర్మించారని పత్రికల్లో కథనాలు వెలువడ్డాయి. వాటి ఆధారంగా సుమోటో కేసు నమోదుచేసి మద్రాసు హైకోర్టు విచారణ చేపట్టింది. కోలడి నది ప్రస్తుతం 112 ఎకరాలకు కుదించుకు పోయిందని హైకోర్టు ఆవేదన వ్యక్తం చేసింది. తగిన పట్టాలు పొంది ఈ ప్రాంతంలో ప్రజలు ఇళ్లు నిర్మించుకున్నారని, వారి విజ్ఞప్తి కూడా పరిశీలించాలని బాధితుల తరఫున వివరించారు. వాదనల అనంతరం జలాశయాల ఆక్రమణలపై ఇప్పటివరకు చేపట్టిన చర్యలతో నివేదిక దాఖలుచేయాలని రాష్ట్రప్రభుత్వానికి ఉత్తర్వులు జారీచేసిన హైకోర్టు, ఈ కేసులో న్యాయస్థానానికి సహాయంగా సీనియర్ న్యాయవాది ఆర్. షణ్ముగసుందరంను నియమించింది.

క్రైస్తవ సంస్థలకు బోర్డు ఉండాలి

● హైకోర్టు

పెరంబూర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): హిందూ దేవాదాయ శాఖ, వక్ఫ్ బోర్డు ఉన్నట్లు క్రైస్తవ సంస్థల నియంత్రణ చట్టబద్ధమైన బోర్డు ఉండాలని హైకోర్టు మదురై డివిజన్ బెంచ్ అభిప్రాయపడింది. నాగర్‌కోయిల్‌లోని స్కాట్ క్రైస్తవ కళాశాల ఛాన్సలర్ నియామకానికి సంబంధించిన కేసులో జస్టిస్ సతీష్‌కుమార్ ఈ వ్యాఖ్యలు చేశారు. అలాగే, క్రైస్తవ సంస్థలు విద్య, వైద్యం వంటి అనేక ప్రజా సేవలు చేయడం మరిచిపోలేమన్నారు. ఆయా సంస్థల ఆస్తులు, నిధులకు రక్షణ కల్పించాల్సిన అవసరం ఉందని, ఈ సంస్థల నిర్వహణకు చట్టబద్ధమైన బోర్డు ఉండాలని న్యాయమూర్తి అభిప్రాయం వ్యక్తం చేశారు.

రూ.1.47 కోట్ల మోసం.. సీఐపై కేసు

అడయార్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగాల పేరుతో పలువురి వద్ద రూ.1.47 కోట్ల మేర వసూలు చేసి మోసం చేసిన కేసులో సీఐపై పోలీసులు కేసు నమోదు చేశారు. తేని జిల్లా ఉత్తమపాళెయం సమీపంలోని శెట్టిపట్టికి చెందిన సీఐ ఏసు రాజశేఖరన్ గతంలో కన్నియాకుమారి జిల్లా మార్తాండంలో పనిచేసేవారు. ఆ సమయంలో అతడి భార్య కనకదుర్గ నెల్లై జిల్లాలో విద్యాశాఖలో ఉన్నతాధికారి వ్యవహరించేవారు. ఆమె ద్వారా ప్రభుత్వ ఉద్యోగాలు కల్పిస్తానంటూ స్థానికులను నమ్మబలికారు. దీంతో 27 మంది నుంచి రూ.1.47 కోట్ల మేర వసూలు చేశారు. నెలలు గడుస్తున్నప్పటికీ బాధితులకు ఉపాధి అవకాశాల కల్పించకపోగా వసూలు చేసిన డబ్బు కూడా తిరిగివ్వలేదు. దీంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కన్నియాకుమారి జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు నేర విభాగం పోలీసులు ఏసు రాజశేఖరన్‌తో పాటు భార్య కనకదుర్గ మరో ఇద్దరిపై కేసు నమోదు చేశారు. అలాగే, ఏసు రాజశేఖరన్‌ను వీఆర్‌కు పంపుతూ పోలీస్ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీచేశారు.

యూ ట్యూబర్ ఇర్ఫాన్‌కు నోటీసు

ప్యారీస్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఓ ప్రైవేటు ఆస్పత్రిలో ఆపరేషన్ థియేటర్‌లో పాప బొడ్డు తాడు కోస్తున్న వీడియో పోస్ట్ చేసిన వ్యవహారంలో యూ ట్యూబర్ ఇర్ఫాన్‌కు రాష్ట్ర ఆరోగ్యశాఖ నోటీసు జారీచేసింది. నగరానికి చెందిన ఇర్ఫాన్-ఆశిబేగం దంపతులకు జులైలో ప్రైవేటు ఆస్పత్రిలో శిశువు జన్మించింది. పాప బొడ్డు తాడు కోస్తున్న వీడియోను ఇర్ఫాన్ సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన వీడియో వివాదస్పదమైంది. ఈ నేపథ్యంలో, ఈ వ్యవహారంపై ఇర్ఫాన్‌కు ఆరోగ్యశాఖ నోటీసు జారీచేసింది.

బస్తాలో నగదు మాయం

పెరంబూర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): వడలూరు సమీపంలో బియ్యం బస్తా కొనుగోలు చేసిన సమయంలో, అందులో రూ.15 లక్షల నగదు ఉన్న నేపథ్యంలో, దుకాణ యజమాని, కొనుగోలుదారుడి మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. కడలూరు జిల్లా వడలూరు రాఘవేంద్ర సిటీలో నివసిస్తున్న షణ్ముగం నైవేలీ మెయిన్ రోడ్డు బియ్యం దుకాణం నడుపుతున్నాడు. యజమాని బావమరిది శ్రీనివాసన్ దుకాణంలో సేల్స్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. దుకాణంలో విక్రయాలకు వచ్చిన రూ.15 లక్షల నగదును భద్రతా కారణాల రీత్యా ఓ బియ్యం బస్తాలో షణ్ముగం దాచినట్లు సమాచారం. ఈ క్రమంలో, మందారకుప్పం సమీపం కురవన్‌కుప్పం మేల్‌పాది గ్రామానికి చెందిన భూపాలన్ దుకాణానికి వచ్చి 16 కిలోల బియ్యం బస్తా కొనుగోలు చేశాడు. ఆ సమయంలో దుకాణంలో లేని షణ్ముగం కొద్దిసేపటి తర్వాత దుకాణానికి వచ్చాడు. తాను నగదు దాచిన బస్తా భూపాలన్ తీసుకెళ్లాడని తెలుసుకున్న షణ్ముగం దిగ్ర్భాంతి చెందాడు. దీంతో, షణ్ముగం, శ్రీనివాసన్‌లు హుటాహుటిన భూపాలన్ ఇంటికి చేరుకున్నారు. అప్పటికే బియ్యం బస్తా విప్పి ఉండడాన్ని గుర్తించిన షణ్ముగం, ఇంట్లో ఉన్న భూపాలన్ కుమార్తె వద్ద, ఈ బస్తాలో రూ.15 లక్షలు ఉంచినట్లు, దానిని తిరిగి ఇవ్వాలని కోరాడు. అందుకు బదులుగా, బస్తాలో రూ.10 లక్షలు మాత్రమే ఉందంటూ, ఈ నగదును షణ్ముగంకు అందించారు. ఈ నగదు తీసుకున్న భూపాలన్, మిగిలిన రూ.5 లక్షలు ఏమైందని వాగ్వివాదానికి దిగాడు. ఈ వ్యవహారంపై షణ్ముగం ఫిర్యాదుతో వడలూరు పోలీసులు విచారణ చేపట్టారు.

రూ.12 లక్షల విలువైన నగలు స్వాధీనం

అడయార్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మలేసియా నుంచి తిరుచ్చికి ఒక ప్రయాణికురాలు తీసుకొచ్చిన రూ.12 లక్షల విలువైన బంగారు నగలను ఎయిర్‌పోర్టు అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మలేసియా రాజధాని కౌలాలంపూర్ నుంచి ఎయిర్ ఇండియా విమానంలో బుధవారం రాత్రి తిరుచ్చి వచ్చిన ప్రయాణికులను కస్టమ్స్ అధికారులు తనిఖీలు చేశారు. ఇందులో ఓ ప్రయాణికురాలి బ్యాగులో వివిధ రకాలబంగారు నగలను చట్ట వ్యతిరేకంగా తీసుకొచ్చినట్టు గుర్తించారు. వీటి విలువ రూ.21.43 లక్షలుంటుందని ఎయిర్‌పోర్టు అధికారులు వెల్లడించారు. ఈ నగలను స్వాధీనం చేసుకుని, ప్రయాణికురాలివద్ద విచారణ జరుపుతున్నారు.

కోవైలో రవాణా సంస్థ బస్సు దగ్ధం

● 40మందికి తప్పిన ముప్పు

చెన్నై, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూరు జిల్లా ఒత్తకాల్ మండపం ఫ్లైఓవర్ వద్ద గురువారం ఉదయం రవాణా సంస్థ బస్సు హఠాత్తుగా దగ్ధమైంది. కోయంబత్తూరు జిల్లా పొల్లాచ్చి నుంచి కోయంబత్తూరు రాష్ట్ర రవాణ సంస్థ బస్సు 40 మంది ప్రయాణికులతో బయలుదేరింది. పొల్లాచ్చికి చెందిన సురేష్ బస్సుకు డ్రైవరుగా, కదిరేశన్ కండెక్టర్‌గా డ్యూటీలో ఉన్నారు. ఆ బస్సు గురువారం ఉదయం 8 గంటల సమయంలో ఒత్తకాల్‌మండపం ఫ్లైఓవర్ వద్ద వెళుతుండగా ఉన్నట్టుండి ఇంజన్‌లో నుంచి పొగలు వచ్చాయి. డ్రైవర్ సురేష్ వెంటనే బస్సు ఆపి, ప్రయాణికులందరిని కిందకు దించేశారు. ఆ లోగా బస్సు ముందు భాగంలో చెలరేగిన మంటలు నలువైపులా వ్యాపించాయి. దీంతో ఆ బస్సు పూర్తిగా దగ్ధమైంది. ఈ సమాచారం తెలుసుకుని అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన అక్కడికి వెళ్ళి మంటలను ఆర్పేందుకు ప్రయత్నించారు. చెట్టి పాళయం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

చెన్నైలో కిలో కెటామిన్ పట్టివేత

ఆంధ్రాకు చెందిన వ్యక్తి అరెస్ట్

చెన్నై, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక మాధవరం ప్రాంతంలో కిలో కెటామిన్ విక్రయిస్తూ పట్టుబడిన ఆంధ్రా వ్యక్తి వద్ద పోలీసులు విచారణ జరుపుతున్నారు. అరుంబాక్కం మాదకద్రవ్యాల నిరోధక విభాగం సహాయ కమిషనర్ నేతృత్వంలోని ప్రత్యేక పోలీసులకు మాధవరం ప్రాంతంలో ఆంధ్రాకు చెందిన వ్యక్తి మాదకద్రవ్యాలు విక్రయిస్తున్నట్లు తెలిసింది. దీంతో ఇటీవల మారువేషంలో అక్కడకు వెళ్లిన పోలీసులు సంబంధిత వ్యక్తి వద్ద తమకు కిలో కెటామిన్ కావాలని అడిగారు. దీంతో అతను వారిని బుధవారం రాత్రి మాధవరం బస్టాండు వద్దకు రావాలని, అక్కడ అందజేస్తానని చెప్పాడు. ఆ మేరకు అక్కడకు వెళ్లిన పోలీసులు.. ఆ వ్యక్తి వద్ద కిలో కెటామిన్ స్వాధీనం చేసుకుని, అతనిని అరెస్టు చేశారు. అతను ఒంగోలుకు చెందిన విశ్వనాథ్ (48)గా విచారణలో తేలింది. అతను వివిధ ప్రాంతాల నుంచి మత్తు పదార్థాలను తీసుకొచ్చి, నగరంలోని పలువురు డీలర్లకు సరఫరా చేస్తున్నట్లు కూడా తెలిసింది.



'దీపావళి బోనస్' చిత్ర బృందం

కుటుంబ కథాచిత్రం 'దీపావళి బోనస్'

● నిర్మాత దీపక్ కుమార్

అంకాళపరమేశ్వరి ప్రొడక్షన్స్ బ్యానరుపై దీపక్ కుమార్ డాలా నిర్మాతగా, నూతన దర్శకుడు జయపాల్ జె దర్శకత్వంలో విక్రాంత్, రిత్విక జంటగా నటించిన చిత్రం 'దీపావళి బోనస్'. శుక్రవారం విడుదలవుతున్న ఈ చిత్రం సామాన్య ప్రజల జీవన పోరాటాలు, ప్రధానంగా దీపావళి వంటి ప్రధాన పండుగలను జరుపుకునేందుకు వారుపడే కష్టాలను నేపథ్యంగా చేసుకుని, కమర్షియల్ ఎలిమెంట్స్‌తో రూపొందించారు. తమిళ చిత్రసీమలో చిన్న బడ్జెట్ చిత్రాలను విడుదల చేసే యాక్షన్ రియాక్షన్ సంస్థ తరపున జెనీష్ తమిళనాడు రాష్ట్రంలోనే వందకు పైగా థియేటర్లలో రిలీజ్ చేస్తున్నారు. విడుదలను పురస్కరించుకుని చిత్ర బృందం బుధవారం రాత్రి నగరంలో మీడియా సమావేశం నిర్వహించింది. నిర్మాత దీపక్ కుమార్ మాట్లాడుతూ, 'సినిమా తీయాలన్న చిరకాల కోరిక ఇప్పటికి నెరవేరింది. సినిమా రంగంలో అనేక కష్టాలున్నప్పటికీ వాటిని అధిగమించడానికి ఎంతో మంది శ్రమిస్తున్నారని తెలిసి ఆశ్చర్యపోయాను. అందుకే సినిమా తీసి కష్టాల్లో ఉన్నవాళ్ళకి అవకాశం ఇవ్వాలని భావించాను. అపుడే నా స్నేహితుడి ద్వారా జయపాలన్ పరిచయమయ్యారు. ఆయనకు కొన్ని షరతులు పెట్టి.. కుటుంబ సమేతంగా చూడదగిన చిత్రాన్ని తీయాలని సూచించాను. అలా రూపొందిన చిత్రమే 'దీపావళి బోనస్'. ప్రేక్షకులతో పాటు మీడియా కూడా ఆదరించాలని కోరారు. ఆ తర్వాత చిత్ర దర్శకుడుతో పాటు యూనిట్ సభ్యులు ప్రసంగించారు.



మోనీషా సెన్

కోలీవుడ్ హీరోయిన్‌గా మోడల్

భారతీయ మోడల్ రంగంలో ప్రముఖంగా రాణిస్తున్న మోనీషా సెన్ కోలీవుడ్‌లో హీరోయిన్‌గా ఎంట్రీ ఇస్తోంది. ఈ విషయాన్ని ఆమె అధికారికంగా వెల్లడించింది. అయితే, ఆమె నటించే ప్రాజెక్టు, నిర్మాణ సంస్థ, హీరో తదితర వివరాలను మాత్రం గోప్యంగా ఉంచారు. పూర్తి వివరాలను ఒకటి రెండు రోజుల్లోనే నిర్మాణ సంస్థ అధికారికంగా వెల్లడిస్తుందని పేర్కొన్నారు. తన అభిమానుల కోసం ఈ విషయాన్ని లీక్ చేస్తున్నట్టు తెలిపారు. చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టాలన్న కోరిక ఇంతకాలానికి నెరవేరుతుందని, మిగిలిన హీరోయిన్ల తరహాలోనే తమిళ ప్రేక్షకులు తనను కూడా ఆదరించి, ప్రేమాభిమానాలు చూపించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

మనసుకు నచ్చిన చిత్రం 'అమరన్'

● మీడియాతో ఎస్కే చిట్‌చాట్



'అమరన్'లో శివకార్తికేయన్, సాయిపల్లవి



శివకార్తికేయన్

ఇప్పటివరకు తాను నటించిన చిత్రాలన్నింటిలోకెల్లా 'అమరన్' చిత్రం తన మనసుకు బాగా నచ్చినదని హీరో శివకార్తికేయన్ చెప్పారు. రాజ్‌కుమార్ పెరియస్వామి దర్శకత్వంలో శివకార్తికేయన్ - సాయిపల్లవి జంటగా నటించిన 'అమరన్' ఈ నెల 31వ తేదీ విడుదలవుతోంది. అగ్రహీరో కమల్ హాసన్ నిర్మాతగా రాజ్ కమల్ ఫిల్మ్ ఇంటర్నేషనల్ పతాకంపై తమిళం, తెలుగు, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో తెరకెక్కించారు. ఇప్పటికే విడుదలైన టీజర్, ట్రైలర్‌తో ఈ సినిమాపై ఒక్కసారిగా అంచనాలు పెరిగిపోయాయి. భారత ఆర్మీ మేజర్ ముకుంద్ వరదరాజన్ జీవిత చరిత్ర ఆధారంగా రూపొందించారు. శివకార్తికేయన్ ముకుంద్ పాత్ర పోషించారు. ఈ నేపథ్యంలో గురువారం హీరో శివకార్తికేయన్ మీడియాలో చిట్‌చాట్ నిర్వహించి, చిత్ర విశేషాలతో పాటు షూటింగ్ అనుభవాలను పంచుకున్నారు. 'ఈ సినిమా షూటింగ్ మొత్తం జమ్మూకశ్మీర్‌లో పూర్తి చేశాం. మేజర్ ముకుంద్ వరదరాజన్ పనిచేసిన లైవ్ లోకేషన్లలోనే చిత్రీకరించాం. 90 రోజుల్లో సినిమా పూర్తి కావడానికి అక్కడి ప్రజల సహకారం మరువలేనిది. షూటింగులో భారత సైన్యం ఉపయోగించే రియల్ గన్స్ ఉపయోగించారు. యాక్షన్ సీక్వెన్స్‌లో మాత్రం డమ్మీ తుపాకీలను ఉపయోగించాం. రియల్ లైఫ్‌లో ముకుంద్ గొప్ప వ్యక్తి. అలాంటి వ్యక్తి జీవిత చరిత్రలో నటించడం అదృష్టంగా భావిస్తున్నాను. మా నాన్న కూడా పోలీస్ అధికారి కావడంలో చిన్నప్పటి నుంచి నాలో దేశభక్తి ఉంది. మేజర్ ముకుంద్ పాత్రలో నటించలేదు. జీవించాను. ఈ సినిమాలో హీరో, హీరోయిన్ పాత్రలు వెన్నెముక వంటివి. జీవీ ప్రకాష్ నేపథ్య సంగీతం మరో లెవల్‌కు తీసుకెళ్ళింది. సినిమా క్లైమాక్స్‌లో ప్రేక్షకులను దృష్టిలో ఉంచుకుని మార్పు చేయడం జరిగింది. లవ్, సెంటిమెంట్, ఎమోషన్స్ ఇలా ప్రతి అంశం ప్రేక్షకులను కట్టిపడేస్తుంది. మురుగదాస్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 80 శాతం మేరకు పూర్తయింది. సాధారణంగా ఒక నటుడు తన పాత్రపై దృష్టిసారిస్తారు. కానీ, సాయిపల్లవి మాత్రం ప్రతి సన్నివేశంపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తారు. అందుకే ఆమె చేసే పాత్రలు ప్రత్యేకంగా ఉంటాయి. ఈ సినిమా నా ఫ్యాన్స్ అమితంగా ఎంజాయ్ చేసేలా ఉంటుంది' అని అన్నారు.

దర్శక నటుడు ఆర్జే బాలాజీకి 'యూత్ ఐకాన్-24' అవార్డు

నటుడు, దర్శకుడు ఆర్జే బాలాజీకి 'యూత్ ఐకాన్ 2024' అవార్డు వరించింది. ఈ అవార్డును మంత్రి పీటీఆర్ పళనివేల్ త్యాగరాజన్ చేతుల మీదుగా అందుకున్నారు. కోయంబత్తూరులోని ఐసీటీ అకాడెమీ బుధవారం రాత్రి తన తొమ్మిదో లీడర్‌షిప్ సమ్మిట్ 2024 నిర్వహించింది. ఇందులో రాష్ట్రం నలుమూలల నుంచి 2500 మందికిపైగా యువ తీయువకులు, విద్యార్థులు హాజరయ్యారు. విభిన్న రంగాలపై చర్చలు, వర్క్‌షాపులు, నెట్‌వర్కింగ్ అవకాశాలు తదితర అంశాలతో ఈ సమ్మిట్ నిర్వహించారు. ఇందులో సమాజం, సినీ పరిశ్రమలో ఆయన తీసుకొచ్చిన సానుకూల మార్పులకుగాను ఆర్జే బాలాజీకి రాష్ట్ర ఐటీ శాఖామంత్రి పీటీఆర్ పళనివేల్ త్యాగరాజన్ అవార్డు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా బాలాజీ మాట్లాడుతూ, 'అవార్డు అందుకోవడం గౌరవంగా భావిస్తున్నాను. సమాజంలో సానుకూల మార్పు కోసం మరింతగా కృషి చేయడానికి ఇది ఎంతగానో దోహదపడుతుంది. యువత తమ కలలను సాకారం చేసుకునేందుకు ఇలాంటి సదస్సులు ఎంతో ప్రేరణ కలిగిస్తాయి' అని పేర్కొన్నారు.



మంత్రి త్యాగరాజన్ నుంచి అవార్డు అందుకుంటున్న ఆర్జే బాలాజీ

టీడీకే మహానాడుకు వెళ్లను

● నటుడు విమల్

చిత్రజ్యోతి

ప్యారీస్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ నటుడు విజయ్ ప్రారంభించిన తమిళగ వెట్రి కళగం (టీవీకే) మహానాడులో తాను పాల్గొనబోనని నటుడు విమల్ పేర్కొన్నారు. విమల్ హీరోగా నటించిన 'సార్' చిత్రం తిరుప్పూర్ శక్తి థియేటర్‌లో విడుదల కాగా, ఈ చిత్ర యూనిట్ సభ్యులతో కలిసి విమల్ కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ... విజయ్ పార్టీ మహానాడులో తాను పాల్గొంటానని నటుడు విశాల్ ప్రకటించడం ఆహ్వానించదగ్గదని, అయితే రాజకీయాలు దూరంగా ఉంటున్న తాను మాత్రం ఆ మహానాడుకు వెళ్లడం లేదని తేల్చిచెప్పారు.



ఆలయ రాజగోపురం

నిత్య సుందరేశ్వరుడు

సుఖసంతోషాలనిచ్చే తిరునెడుంగళనాథుడు

● తిరుమూలర్, సంబంధర్ ఆరాధించిన శైవక్షేత్రం

● మూలవిరాట్టును స్పృశించే ఆదిత్యుడు

ఆధ్యాత్మికం

మానవులంతా పూర్వజన్మలో పుణ్యఫలాల వల్ల ఈ జన్మలో సుఖసంతోషాలు అనుభవిస్తున్నారు. అందరూ సంతోషభరితమైన జీవితాన్నే కోరుకుంటున్నారు. ఈ విషయాన్ని తిరుమూలర్ స్వామి గత జన్మ పాపాలవల్ల సంక్రమించే కష్టనష్టాలు తొలగిపోవడానికి సన్మార్గాన్ని ఎంచుకోవడానికి బదులుగా మళ్ళీ పాపాలే చేస్తున్నారని తన 'తిరుమందిరం'లో చెబుతున్నారు. కష్టాల నుంచి బయటపడేందుకు 'తిరునెడుంగళం' పరమేశ్వరుడిని ఆరాధించడం తప్ప మరో మార్గమే లేదని శైవ భక్త శిఖామణి తిరుజ్ఞానసంబంధర్ తన 'తిరునెడుంగళం' పదిక్కంలో చాటిచెప్పారు. సూర్యభగవానుడు ప్రతియేటా ఆరు రోజులపాటు ఈ ఆలయంలోని మూలవిరాట్టును తనకిరణాలతో స్పృశించడం విశేషం. ఇంతటి కీర్తి ఉన్న తిరునెడుంగళం' శైవక్షేత్రం తిరుచ్చి సమీపంలో ఉంది. - ఆంధ్రజ్యోతి, చెన్నై




రెండు విమానాలతో నిర్మితమైన గర్భాలయం

ఆలయ వైభవం...

ఈ ఆలయం రెండువేల సంవత్సరాల నాటిదని పురావస్తు పరిశోధకులు చెబుతున్నారు. ఈ ఆలయ వెలుపలి ప్రాకారం దాటి వెళ్తే ఐదంతస్థుల రాజగోపురం దర్శనమిస్తుంది. లోపలకు వెళ్తే ధ్వజస్తంభం, బలిపీఠం ఉన్నాయి. వాటిని దాటి ప్రదక్షిణ చేస్తూ వెళ్తే ఈశాన్యంలో తిరుకల్యాణమండపం, మంగళనాయకి అమ్మవారి సన్నిధి కనిపిస్తాయి. వెలుపల ప్రాకారం ఉత్తర దిశగా అగస్త్యమహర్షి సన్నిధి, దానికి ఎదురుగా ఎప్పుడై అడుగంటని అగస్త్య తీర్థం ఉంది. వెలుపలి ప్రాకారాన్ని దాటి లోపలకు వెళ్లగానే వచ్చే మూడంతస్థుల రాజగోపురం గుండా వెళ్తే గర్భాలయంలో స్వయంభు మూర్తిగా తిరునెడుంగళనాథర్ దర్శనమిస్తారు. ఈ స్వామివారిని అగస్త్య మహర్షి ఆరాధించారు. వంద్య చోళరాజుకు, పరమేశ్వరుడు సర్వాంగ సుందరుడై దర్శనమిచ్చిన కారణంగా ఈ క్షేత్ర పురీశ్వరుడిని 'నిత్య సుందరేశ్వరర్ అని కూడా పిలుస్తారు. ఈ క్షేత్రంలోని ఈశ్వరుడిని ఆరు శుక్రవారాలపాటు నేతి దీపాలు వెలిగించి ఆరాధిస్తే అందం ఇనుమడిస్తుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం.



అగస్త్య తీర్థం



స్థలవృక్షం



అంతరప్రాకారంలో బలిపీఠం, నంది

వివాహ భాగ్యానికి.. : ఆలయంలో పడమటి ప్రాకారంలో తూర్పుదిశగా కొలువై ఉన్న వళ్ళి దైవానై సమేత మురుగప్పెరుమాన్ ప్రత్యేక సన్నిధిలో పూజలందుకుంటున్నారు. ఇదే విధంగా వారాహి అమ్మవారి సన్నిధి కూడా ఉంది. ఆ అమ్మవారి ఎదుట ప్రాచీన కాలం నాటి రోకలి, రోకలి బండ ఉన్నాయి. మహిళా భక్తులు మురుగప్పెరుమాన్‌ను మొక్కిన తర్వాత ఈ రోకలితో పసుపుకొమ్మలను దంచి పొడిచేసి, అమ్మవారికి సమర్పిస్తే వివాహం త్వరగా అవుతుందని శైవపండితులు చెబుతున్నారు. ఈ ఆలయంలోని కాలభైరవుడిని గుళికాలంలో మొక్కితే వృత్తి, వ్యాపారం అభివృద్ధి చెందుతాయి. రాహుకాలాల్లో నేతిలో కాల్చిన జంతికల మాలను వేసి ఆరాధిస్తే నాగదోషం తొలగుతుంది. ఆలయం ఎదురుగా సుందరతీర్థ కొలను వద్ద కరుప్పణ్ణసామి దర్శనమిస్తారు. ఆ స్వామికి ఆది, శుక్ర, మంగళవారాల్లో పానకాన్ని నైవేద్యంగా సమర్పిస్తే దీర్ఘకాలిక రోగాలు పటాపంచలవుతాయి.



వినాయకుడి సన్నిధి

జ్యేష్ఠాదేవి... : ఈ ఆలయాన్ని ప్రదక్షిణ చేస్తూ వెళ్తే ఓ చోట జ్యేష్ఠాదేవి సన్నిధిని చూడవచ్చు. కుడివైపు తన కుమారుడైన వృషభుడు, ఎడమవైపు మరో కుమారుడు నంబుడి సమేతంగా ఆ అమ్మవారు దర్శనమిస్తుంది. ఈ జ్యేష్ఠాదేవిని ఆరాధిస్తే ప్రమాదాలు, సోమరితనం, రుతుస్రావ సమస్యలు తొలగుతాయి. మానసిక సమస్యలన్నీ తొలగి ప్రశాంతమైన జీవనం సాగించాలని కోరుకునే భక్తులు ఈ ఆలయాన్ని దర్శించటం ఆనవాయితీ.



శ్రీదేవి, భూదేవి సమేత వరదరాజపెరుమాళ్

అరూపంగా అమ్మవారు..

ఈ క్షేత్రంలో అమ్మవారు మంగళనాయకిగా పేరొందారు. చతర్భుజాలతో కొలువుదీరి భక్తులను అనుగ్రహిస్తున్నారు. మంగళనాయకి అమ్మవారిని తొమ్మిది మంగళవారాల పాటు రాహుకాలంలో నిమ్మపండ్ల దీపాలతో పూజిస్తే కార్యసిద్ధి లభిస్తుందని, వివాహ, సంతానం కలుగుతాయని చెబుతారు. పరమేశ్వరుడు ఇక్కడ అర్ధనారీశ్వరుడై ఉన్నారు. కనుకనే గర్భాలయంలోని శివలింగంతోపాటు అమ్మవారు ఉన్నారని భక్తులు విశ్వసిస్తారు. ఈ కారణంగానే గర్భాలయంపైభాగాన రెండు విమానాలున్నాయి. ఈ రెండు విమానాలు కాశీ ఆలయ గోపుర విమానాలను తలపించేలా ఉన్నాయని శిల్పకళా నిపుణులు చెబుతారు. ఆలయ అంతర ప్రాకారంలో సప్తమాతలు అయ్యనార్, శ్రీదేవీ, భూదేవీ సమేత వరదరాజపెరుమాళ్ కూడా ప్రత్యేక సన్నిధిలో భక్తవరదుడిగా అనుగ్రహిస్తున్నారు. ఈ ఆలయంలోని అయ్యనార్ స్వామివారిని పంగుణి ఉత్తిరం రోజున నేతిదీపాలతో ఆరాధిస్తే గృహయోగం కలుగుతుందని చెబుతారు. ఇదే విధంగా ఆలయంలోని యోగ దక్షిణామూర్తిని ఐదు గురువారాలు నేతిదీపాలతో ఆరాధిస్తే ఉన్నత విద్యావంతులవుతారని భక్తుల ప్రగాఢ విశ్వాసం.

దానిమ్మ గింజలతో అభిషేకం.. : ఆలయంలోని మూలవిరాట్టు తిరునెడుంగళనాథర్‌కు ప్రతిరోజూ మధ్యాహ్నం దానిమ్మగింజలతో అభిషేకం నిర్వహిస్తుంటారు. దానిమ్మ గింజలతో స్వామివారికి అభిషేకం చేస్తే దంపతుల మధ్య సఖ్యత, గృహయోగం, సంతానం, ధనయోగం, స్థలయోగం, వివాహభాగ్యం కలుగుతాయి. ఈ ఆలయంలో మహాశివరాత్రి వేడుకలు వైభవంగా జరుగుతాయి. ప్రతియేటా తమిళ ఆషాఢ (ఆడి) మాసం 7 నుండి 12 వ తేదీ వరకు మూడు రోజులపాటు ఉదయం 6.05 నుండి 6.15 గంటల వరకు మూలవిరాట్టుపై సూర్యకిరణాలు ప్రసరిస్తాయి. దానిని చూడటానికి వేల సంఖ్యలో భక్తులు ఆ ఆలయానికి వెళుతుంటారు. ఇక నటరాజస్వామివారికి ఆరుకాల పూజలు కూడా నిర్వహిస్తారు.



సప్తమాతృకలు

ఎలా చేరుకోవాలి? : రాష్ట్రంలోని పలు నగరాల నుండి తిరుచ్చికి రాష్ట్ర రవాణా బస్సులు, ఆమ్నీ బస్సులు నడుస్తున్నాయి. చెన్నై నుంచి తిరుచ్చికి రైలు సదుపాయం కూడా ఉంది. తిరుచ్చి నుంచి టౌన్ బస్సుల్లో, షేర్ ఆటోల్లో 21 కి.మీ.ల దూరంలో ఉన్న ఈ ఆలయానికి చేరుకోవచ్చు. ఈ ఆలయాన్ని ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మళ్ళీ సాయంత్రం 4 నుండి రాత్రి 8 గంటల వరకు తెరిచి భక్తులను దర్శనానికి అనుమతిస్తారు.



వృద్ధులకు వస్త్రాలు పంపిణీ చేస్తున్న టీఎంసీ అధ్యక్షుడు జీకే వాసన్, వీఎన్ హరినాథ్ తదితరులు

వృద్ధులకు నూతన వస్త్రాల వితరణ

ప్యారీస్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగను పురస్కరించుకొని కోడంబాక్కం అజీస్ నగర్‌లో ఉన్న అన్నై ఉల్లం ఆశ్రమంలో ఉన్న వృద్ధులకు మిఠాయి, నూతన వస్త్రాలను గురువారం తమిళ మానిల కాంగ్రెస్ (టీఎంసీ) అధ్యక్షుడు జీకే వాసన్ పంపిణీ చేశారు. ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ (వామ్) సీనియర్ సిటిజన్స్ ఫోరం-తమిళనాడు ఆధ్వర్యంలో అధ్యక్షుడు వీఎన్ హరినాథ్ ఈ ఆశ్రమానికి ట్రావెల్ బ్యాగ్, వాటర్ బాటిళ్లు అందజేశారు. కార్యదర్శి వి.దామోదర్, ట్రజరర్ ఎం.జగదీష్, టీఎంసీ అధికార ప్రతినిధి జీఆర్ వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంతో ఐటీఐ టాపర్ల భేటీ

చెన్నై, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో 'తొళిల్ 4.0' సాంకేతిక కేంద్రాలుగా స్థాయి పెంచుకున్న ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా కేంద్రాల్లో శిక్షణ పొంది జాతీయ స్థాయిలో ఐటీఐ టాపర్లుగా నిలిచిన విద్యార్థులు ముఖ్యమంత్రి స్టాలిన్‌తో గురువారం భేటీ అయ్యారు. శిక్షణ పొందిన మొదటి సంవత్సరంలోనే ఐటీఐలో జాతీయ స్థాయిలో టాపర్లుగా ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులైన 29 మంది విద్యార్థులు, వారికి సునిశిత శిక్షణ అందించిన ట్రైనర్ సచివాలయంలో ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ముఖ్యమంత్రి చొరవతో రాష్ట్ర ఉపాధి కల్పన శిక్షణా శాఖ కింద పనిచేసే 71 ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా కేంద్రాలను రూ.2877.43 కోట్లతో టాటా టెక్నాలజీస్ సంస్థతో కలిసి 'తొళిల్ 4.0' పేరుతో స్థాయి పెంచారు. ఆగస్టు 12 నుండి సెప్టెంబర్ 9 వరకు జరిగిన జాతీయ స్థాయి ఐటీఐ పరీక్షలకు రాష్ట్రానికి చెందిన 26,236 ప్రభుత్వ ఐటీఐ విద్యార్థులు, 19097 మంది ప్రైవేటు ఐటీఐ విద్యార్థులు సహా మొత్తం 45,333 మంది హాజరయ్యారు. ఈ పరీక్షలలో 'తొళిల్ 4.0' శిక్షణా కేంద్రాల్లో శిక్షణ పొందిన, మొదటి సంవత్సరంలోనే ఇండస్ట్రియల్ రోబోటిక్స్ సాంకేతిక విభాగంలో వేప్పలోడై ప్రభుత్వ ఐటీఐ శిక్షణా కేంద్రంలో శిక్షణ పొందిన విద్యార్థి ఎస్.ఆంటోని జేసురాజ్, తిరుచ్చి ప్రభుత్వ ఐటీఐ శిక్షణా కేంద్రం విద్యార్థిని ఎస్.మోహనప్రియ అఖిల భారత స్థాయిలో ఫస్ట్‌ర్యాంక్ సాధించారు. మాన్యుఫాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ అండ్ ఆటోమేషన్ సాంకేతిక విభాగంలో చిదంబరం ప్రభుత్వ శిక్షణా కేంద్రంలో శిక్షణ పొందిన విద్యార్థిని యు.ప్రసిత, వేప్పలోడై ప్రభుత్వ సాంకేతిక శిక్షణా కేంద్రం విద్యార్థి ఎస్. మణి మురుగన్ కూడా టాపర్లుగా నిలిచారు. ఐటీలో కోయంబత్తూరుకు చెందిన కే హిందూశ్రీ జాతీయ స్థాయిలో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణురాలైంది. ఇదేవిధంగా 19 ప్రభుత్వ సాంకేతిక శిక్షణా కేంద్రం విద్యార్థులు, ఐదుగురు ప్రైవేటు సాంకేతిక శిక్షణా కేంద్రం విద్యార్థులు సహా మొత్తం 29 మంది జాతీయ స్థాయిలో టాపర్లుగా నిలిచినట్లు ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఇక క్రాఫ్ట్ ఇన్‌స్ట్రక్టర్ ట్రైనింగ్ స్కీమ్ (సీఐటీఎస్) పరీక్షలో కాట్టుమన్నార్‌కోవిల్ ప్రభుత్వ సాంకేతిక శిక్షణా కేంద్రానికి చెందిన ట్రైనర్ వి.శ్వేతా వెల్డర్ సాంకేతిక విభాగంలో అఖిల భారత స్థాయిలో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణురాలైందని ప్రకటించారు. ఇలా జాతీయ స్థాయిలో టాపర్లుగా ఉత్తీర్ణులైన ఈ 29 మంది విద్యార్థులు, ట్రైనర్ సచివాలయంలో ముఖ్యమంత్రి స్టాలిన్ మర్యాదపూర్వకంగా కలుసుకోగా, వారిని సీఎం అభినందించారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంక్షేమం, ప్రతిభాపాటవాల అభివృద్ధి శాఖ మంత్రి సీవీ గణేశన్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎన్.మురుగానందం, కార్మిక సంక్షేమం, ప్రతిభాపాటవాల అభివృద్ధి శాఖ కార్యదర్శి కే వీరరాఘవరావు, ఉపాధికల్పన శిక్షణా శాఖ సంచాలకులు పి.విష్ణుచంద్రన్ తదితరులు పాల్గొన్నారు.



ఐటీఐ టాపర్లుగా నిలిచిన విద్యార్థులు, ట్రైనర్ వి.శ్వేతతో ముఖ్యమంత్రి స్టాలిన్, మంత్రి సీవీ గణేశ్, అధికారులు



సాధారణంగా వరి నాట్లంటే స్థానికంగా ఉన్న మహిళా కూలీలు వేస్తుంటారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వీరు రూ.500 వరకు కూలి తీసుకునేవారు. కానీ, ఏడాదిన్నరగా బెంగాల్ నుంచి మగ కూలీలొస్తున్నారు. కోట, వాకాడు, చిట్టమూరు ప్రాంతాలలో వీరు వరి నాట్లు వేస్తున్నారు. ఎకరా పొలంలో నాట్లు వేసేందుకు 4,300 రూపాయలు తీసుకుంటున్నారు. కాగా, వరినాట్లకు బెంగాల్ మగకూలీలకు డిమాండు పెరిగింది.

- కోట, ఆంధ్రజ్యోతి

గూడలి వద్ద వరినాట్లు వేస్తున్న మగ కూలీలు

'విజ్ఞానగిరి' వద్ద మద్యం దుకాణం వద్దు

శ్రీకాళహస్తి పట్టణ నడిబొడ్డున సుబ్రహ్మణ్యేశ్వర స్వామికొలువైన విజ్ఞానగిరి (కుమారస్వామి తిప్ప) ఆలయం వద్ద మద్యం దుకాణం ఏర్పాటు చేయొద్దంటూ మహిళలు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు వారు గురువారం ఎక్సైజ్ సీఐ లావణ్యకు వినతిపత్రం ఇచ్చారు. ఈ ప్రాంతంలో విద్యాసంస్థలు, ఆస్పత్రితో పాటు ఆలయం, ముక్కంటి ఆలయ నారదపుష్కరణి ఉన్నట్లు వివరించారు. వైసీపీ పాలనలోనూ కుమారస్వామి తిప్ప వద్ద మద్యం దుకాణం ఏర్పాటుకు అధికారులు ప్రయత్నించగా తమ నిరసనతో ఆపేశారని గుర్తుచేశారు. ప్రస్తుతం ఇక్కడ మద్యం దుకాణం ఏర్పాటుకు కొందరు ప్రయత్నిస్తున్నారని.. ఈ ప్రాంత ప్రాశస్త్యం రీత్యా అనుమతి ఇవ్వొద్దని కోరారు.

- శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి


ఎక్సైజ్ సీఐ లావణ్యకు వినతిపత్రం ఇస్తున్న మహిళలు

గ్రంథాలయ విద్యలో 50 ఏళ్లు

● నేటినుంచి ఎస్వీయూలో లైబ్రరీ సైన్స్ విభాగ స్వర్ణోత్సవాలు



లైబ్రరీ సైన్స్ విభాగం

విజ్ఞాన కేంద్రాలుగా గ్రంథాలయాలు సమాజంలో నిలిచాయి. ఎస్వీయూలో లైబ్రరీ సైన్స్ డిపార్ట్‌మెంట్ 1974లో ప్రారంభమైంది. తొలుత బీఎల్ఐఎస్సీ కోర్సు నిర్వహించింది. ప్రస్తుతం ఎంఎల్ఐఎస్సీ, పీహెచ్‌డీ కోర్సులు నిర్వహిస్తూ ఉంది. తొలి రోజుల్లో ఎస్.శ్రీపతి నాయుడు, ఎన్.గురుస్వామి నాయుడు, టి.రాజగోపాల్ తదితరులు ఆచార్యులుగా ఈ విభాగంలో సేవలు అందించారు. ప్రస్తుతం ఒక రెగ్యులర్ ఫ్యాకల్టీతో పాటు మిగతా అకడమిక్ కన్సల్టెంట్లు బోధన సాగిస్తూ ఉన్నారు. లైబ్రరీ సైన్స్ డిపార్ట్‌మెంట్‌లో ఇప్పటి వరకు 89 పీహెచ్‌డీలు, 32 ఎంఫిల్ డిగ్రీలు పూర్తయ్యాయి. చిన్నారుల్లో పుస్తక అధ్యయనం పట్ల ఆసక్తిని పెంచడంపై ఒక పరిశోధనా ప్రాజెక్టు నిర్వహించారు. పీజీలో ప్రతిభ చూపిన విద్యార్థులకు ఏటా నాలుగు బంగారు పతకాలు ప్రదానం చేస్తున్నారు. పలు జాతీయ, అంతర్జాతీయ సదస్సులను నిర్వహించారు. గ్రంథాలయ నిర్వహణ పట్ల విద్యార్థులకు ప్రయోగాత్మకంగా అవగాహన కలిగిస్తున్నారు. ఇలా బోధన, పరిశోధన, విస్తరణ రంగాల్లో సేవలు అందించింది. గ్రంథాలయ విద్యలో ఎంతో మంది విద్యార్థులను తీర్చిదిద్దింది. పూర్వ విద్యార్థులు ప్రస్తుతం అనేక చోట్ల ఉన్నత స్థానాల్లో రాణిస్తున్నారు. ఈ నేపథ్యంలో వర్సిటీ లైబ్రరీ సైన్స్ విభాగం స్వర్ణోత్సవాలు నిర్వహించుకోనుంది.


శ్రీపతి నాయుడు


గురుస్వామి నాయుడు

- తిరుపతి(విశ్వవిద్యాలయాలు), (ఆంధ్రజ్యోతి)

ఘనమైన స్ఫూర్తిని కొనసాగిస్తాం



యాభై ఏళ్ల సుదీర్ఘ చరిత్రను ఒకసారి సమీక్షించుకుంటాం. గడిచిన చరిత్రను గుర్తు చేసుకోవడం ద్వారా భవిష్యత్తులో చేయవలసిన అభివృద్ధికి అవసరమైన స్ఫూర్తిని పొందుతాం. ఇలా లైబ్రరీ సైన్స్ విభాగాన్ని మరింతగా అభివృద్ధి చేయడానికి ప్రయత్నిస్తాం.

- ప్రొఫెసర్ ప్రశాంతికుమారి, హెడ్, లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్

నేడు స్వర్ణోత్సవ సంబరం : లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్ స్వర్ణోత్సవ సంబరం శుక్రవారం నుంచి రెండు రోజుల పాటు జరగనుంది. ఉదయం 10 గంటలకు సెనేట్ హాల్లో ఈ కార్యక్రమం ప్రారంభం కానుంది. ఇందులో ఇన్‌చార్జి వీసీ అప్పారావు, ద్రవిడ వర్సిటీ ఇన్‌చార్జి వీసీ దొరస్వామి, వర్సిటీ రిజిస్ట్రార్ భూపతి నాయుడు, ప్రిన్సిపాల్ సుధారాణి, సెంట్రల్ లైబ్రరీ డైరెక్టర్ ప్రొఫెసర్ కె.సురేంద్రబాబు, లైబ్రరీ సైన్స్ హెడ్ ప్రశాంతకుమారి పాల్గొంటారు. గోల్డెన్ జూబ్లీ సావనీర్‌ను ఆవిష్కరిస్తారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు.

రేపు డ్రైవర్ రహిత మెట్రో రైల్ ట్రయల్ రన్



అడయార్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): చెన్నై మెట్రో రైల్ ప్రాజెక్టులో భాగంగా డ్రైవర్ రహిత మెట్రో రైళ్ళను నగరంలో నడపనున్నారు. ఇందులో భాగంగా, మెట్రో రైల్ అధికారులు ఈ నెల 26న తొలి డ్రైవర్ రహిత మెట్రో రైల్ టెస్ట్ డ్రైవ్ నిర్వహించనున్నారు. పూందమల్లిలోని టెస్ట్ డ్రైవింగ్ ట్రాక్‌లో ఈ రైళ్ళను పరీక్షిస్తారు. చెన్నై నగరంలో ప్రజా రవాణా సులభతరం చేసే చర్యల్లో భాగంగా మెట్రో రైల్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఇపుడు రెండో దశ నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. రూ.63,246 కోట్లతో చేపట్టే ఈ ప్రాజెక్టును మాధవరం మిల్క్ కాలనీ - సిరుచ్చేరి, లైట్ హౌస్ నుంచి పూందమల్లి, మాధవరం నుంచి షోలింగనల్లూరు వరకు మూడు మార్గాల్లో నిర్మాణ పనులు జోరుగా సాగుతున్నాయి. అయితే, పూందమల్లి నుంచి లైట్ హౌస్ మార్గంలో డ్రైవర్ రహిత మెట్రో రైళ్ళను నడపడంపై అధికారులు దృష్టిసారించారు. ఇందుకోసం మూడు బోగీలతో కూడిన 36 మెట్రో రైళ్ళ తయారీ (మొత్తం బోగీలు 108)ని ఆల్‌స్టోమ్ ట్రాన్స్‌పోర్ట్ కంపెనీ తయారు చేస్తోంది. ఇందులోభాగంగా తొలి డ్రైవర్ రహిత రైలు తయారు చేసిన ఈ కంపెనీ మెట్రో రైల్ అధికారులకు గత నెల 22వ తేదీ అప్పగించింది. ఇదే విషయంపై మెట్రో రైల్ అధికారులు మాట్లాడుతూ, వచ్చే యేడాది జనవరి నుంచి దాదాపు మూడు నెలల పాటు పూందమల్లి మెట్రో రైల్ డిపోలో 900 మీటర్ల వరకు నిర్మించిన టెస్ట్ డ్రైవింగ్ ట్రాక్‌పై ట్రయల్ రన్ నిర్వహిస్తామన్నారు. ఆ తర్వాత మరో ఆరు నెలల పాటు పూందమల్లి నుంచి పోరూర్ వైపు వెళ్ళే ప్రధాన మార్గంలో కొన్ని కిలోమీటర్ల వరకు ఈ రైలు ట్రయల్ రన్ నిర్వహిస్తామని తెలిపారు. పూందమల్లి డిపోలో టెస్ట్ డ్రైవింగ్ ట్రాక్‌లో ఈ రైళ్ళ బ్రేక్ స్థితిగతులు, బ్రేక్ పాయింట్, ప్రయాణికుల భద్రత తదితర అంశాలను అధ్యయనం చేస్తామని వెల్లడించారు.

రూ.32.62 కోట్లతో విక్టోరియా హాలుకు నూతన సొబగులు

● పనులను పరిశీలించిన మేయర్

చెన్నై, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): సింగార చెన్నై 2.0 పథకం కింద రూ.32.62 కోట్లతో రిప్పన్ భవనానికి చేరువగా ఉన్న చారిత్రాత్మక భవనం విక్టోరియా పబ్లిక్ హాల్‌ను దాని ప్రాచీనతకు భంగం కలగని విధంగా పునర్నిర్మిస్తున్నట్లు గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ మేయర్ ఆర్.ప్రియా తెలిపారు. గురువారం ఆ హాలులో జరుగుతున్న పునర్నిర్మాణ పనులను ఆమె అధికారులతో కలిసి పరిశీలించారు. రెండంతస్థుల ఈ భవనం 48 మీటర్ల పొడవు, 24 మీటర్ల వెడల్పు, మెయిన్ టవర్ 19 మీటర్ల ఎత్తు ఉందని ఆమె వివరించారు. ఈ హాలు ప్రాచీనతకు ఎలాంటి ముప్పు వాటిల్లకుండా ఇంజనీరింగ్ సాంకేతిక నిపుణులు జాగ్రత్తగా మెరుగులు దిద్దుతున్నారని తెలిపారు. మేయర్‌తో పాటు కమిషనర్ జే. కుమారగురబరన్, డిప్యూటీ కమిషనర్ (పనుల విభాగం) వీ శివకృష్ణమూర్తి, ఇంజనీరింగ్ సూపర్‌వైజర్ (ప్రత్యేక పథకాల విభాగం) పీవీ బాబు ఉన్నారు.



విక్టోరియా హాలు పునర్నిరాణ పనులను పరిశీలిస్తున్న మేయర్ ఆర్.ప్రియ

టీవీకే మహానాడు విజయం కోసం
విజయ్ తల్లిదండ్రుల పూజలు

చెన్నై, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 27న విక్రవాండి వద్ద నిర్వహించనున్న తమిళగ వెట్రికళగం (టీవీకే) తొలిమహానాడు విజయవంతం కావాలని కోరుకుంటూ ఆ పార్టీ అధ్యక్షుడు, సినీ నటుడు విజయ్ తల్లిదండ్రులు సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. విజయ్ తండ్రి చంద్రశేఖర్, తల్లి శోభా చంద్రశేఖర్ గురువారం కొరట్టూరులో విజయ్ నిర్మించిన సాయిబాబా ఆలయానికి వెళ్ళారు. బాబా దర్శనానంతరం భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.


సాయిబాబా ఆలయానికి వెళ్తున్న విజయ్ తల్లి శోభ

మాజీ మంత్రి నివాసం, కార్యాలయాల్లో
రెండో రోజూ ఈడీ తనిఖీలు


చెన్నై, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి ఓ.పన్నీర్‌సెల్వం అనుచరుడు, మాజీ మంత్రి, ఒరత్తనాడు ఎమ్మెల్యే వైద్యలింగం నివాసగృహం, కార్యాలయాల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం (ఈడీ) అధికారుల తనిఖీ గురువారం కూడా కొనసాగింది. గత అన్నాడీఎంకే ప్రభుత్వ హాయంలో గృహనిర్మాణాలకు అనుమతిచ్చేందుకు రూ. 27.90 కోట్ల మేరకు లంచాలు తీసుకున్నారని ఏసీబీ కేసు నమోదు చేసింది. ఈ కేసు ఆధారంగా ఈడీ అధికారులు అక్రమ నగదు బట్వాడా నిరోధకచట్టం కింద వైద్యలింగంపై కేసు నమోదు చేసి రంగంలోకి దిగారు. బుధవారం ఒకే సమయంలో చెన్నైలో 9 చోట్ల, తంజావూరులో 4 ప్రాంతాల్లో ఈడీ దాడులు జరిగాయి. ఉదయం ప్రారంభమైన తనిఖీలు అర్ధరాత్రి వరకూ కొనసాగాయి. ఈనేపథ్యంలో గురువారం ఉదయం ఆరు ప్రాంతాల్లో ఈడీ తనిఖీలు చేపట్టింది. అశోక్‌నగర్‌లోని వైద్యలింగం కార్యాలయం, శ్రీరామ్‌గ్రూపు ఆఫీసు సహా ఆరుచోట్ల సోదాలు జరిపిన ఈడీ అధికారులు కీలకమైన దస్తావేజులు స్వాధీనం చేసుకున్నారు.

కేసు వివరాలు...

2011లో అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో ఆర్.వైద్యలింగం గృహనిర్మాణం, నగరాభివృద్ధి శాఖ మంత్రిగా పనిచేశారు. శ్రీరామ్ ప్రాపర్టీస్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ అనే సంస్థకు చెన్నై పెరుంగళత్తూరులో భవనసముదాయం, ఐటీ సంస్థల భవనాలు నిర్మించేందుకు ప్రణాళికాపరమైన అనుమతిచ్చేందుకు రూ.27.90 కోట్ల మేర ముడుపులు స్వీకరించినట్లు అరప్పోర్ ఇయక్కమ్ అనే స్వచ్ఛంద సంస్థ రాష్ట్ర అవినీతి నిరోధక విభాగా నికి ఫిర్యాదు చేసింది. ఆ ఫిర్యాదు మేరకు వైద్యలింగం, ఆయన కుమారులు ప్రభు, షణ్ముగప్రభు, ముత్తమ్మాళ్ ఎస్టేట్ డైరెక్టర్ పన్నీర్‌సెల్వం, శ్రీరామ్ ప్రాపర్టీస్ సంస్థ డైరెక్టర్ రమేష్, భారత్ కోల్ కెమికల్స్ నిర్వాహకులు సహా 11 మందిపై ఏసీబీ సెప్టెంబర్ 19న కేసు నమోదు చేసింది. ఈ కేసును ప్రాతిపదికగా తీసుకుని ఈడీ అధికారులు అక్రమ నగదు బట్వాడా కేసు నమోదు చేసి రెండు రోజులపాటు తనిఖీలు చేపట్టింది.

75 శాతం గృహాల నీటిలో ఈ.కొలి బ్యాక్టీరియా

● నగరంలోనే అధికం ● ఐఐటీ మద్రాసు పరిశోధనలో వెల్లడి





పెరంబూర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రాజధాని నగరం చెన్నైలో ఉన్న 75 శాతం గృహాల్లో వినియోగించే నీటిలో ఈ.కొలి బ్యాక్టీరియా ఉన్నట్లు ఐఐటీ మద్రాసు జరిపిన పరిశోధనల్లో వెల్లడైంది. మద్రాసు ఐఐటీ ప్రొఫెసర్లు, విద్యార్థులు సంయుక్తంగా 'పీపుల్స్ వాటర్ డేటా ఇనిషివేటివ్' కార్యక్రమంలో భాగంగా నగరంలోని 752 గృహాల నుంచి తాగునీటి నమూనాలు సేకరించారు. గృహాల్లోని కొళాయిలు, బావులు సహా ఇతర నీటి వనరుల నుంచి నీరు సేకరించి ల్యాబ్‌కు పంపారు. ఆ పరిశోధనల్లో తాగునీటిలో 'ఈ.కొలి' బ్యాక్టీరియా కాలుష్యం కలిసినట్లు వెల్లడైంది. ఈ బాక్టీరియా ప్రభావంతో విరోచనాలు, వాంతులు వంటివాటితో తరచుగా అనారోగ్యానికి గురవుతారని తెలుస్తోంది. నీటి పైపులు, ట్యాంకులు, కంటైనర్లలో ఈ బ్యాక్టీరియా ఉంటుందని తెలిపారు. కొళాయిలు, బోరు బావులు, ఇతర వనరుల నుంచి నేరుగా వచ్చే నీటి నుంచి మాత్రమే ఈ బ్యాక్టీరియా కలుషితం అనుకోవడం పొరపాటని పరిశోధక బృందం సభ్యులు తెలిపారు. నీటిని శుభ్రంగా ఉంచుకొనే కొన్ని గృహాల్లోనూ ఈ బాక్టీరియా కనిపించడం దిగ్భ్రాంతి కలిగించిందని వారు వ్యాఖ్యానించారు. ఈ విషయమై ఐఐటీ మద్రాసులోని వాటర్ ప్రోగ్రామ్ కోర్స్ కో-ఆర్డినేటర్ ప్రదీప్ మాట్లాడుతూ... బ్యాక్టీరియాతో కలుషితమైన ఇళ్లలో 75 శాతం మంది పిల్లలు నివసిస్తున్నారని, వారు కూడా బ్యాక్టీరియాకు గురయ్యే అవకాశముందని అధ్యయనంలో వెల్లడైందని తెలిపారు. ఇలా బ్యాక్టీరియా కలుషితం కాకుండా ఉండాలంటే వాటర్ ప్యూరిఫైయర్ తయారీదారులు ఇచ్చే సూచనలు పాటించాలని, కాచి చల్లార్చిన నీటిని తాగడం శ్రేయస్కరమని ఆయన తెలిపారు.

ఈ.కొలి అంటే ఏమిటి...?

ఈ.కొలి అంటే 'ఎచేరిచియా కొలి (Escherichia.coil)' అని సారాంశం. ఇది మనుషులు, జంతువుల ఉదర పేగుల్లో సాధారణంగా కనిపించే బ్యాక్టీరియా. ఈ బ్యాక్టీరియా ఎలాంటి హాని చేయకపోగా ఆహారం జీర్ణం అయ్యేందుకు దోహదం చేస్తుంది. అలాగే, హాని కలిగించే క్రిములను ఈ బాక్టీరియా నాశనం చేస్తుంది. శరీరానికి కావాలసిన విటమిన్లను కూడా ఈ బ్యాక్టీరియా ఉత్పత్తి చేస్తుందని వైద్యులు పేర్కొన్నారు. విరోచనాలు, మూత్రాశయ మార్గంలో క్రిములు, సిఫిలిస్, నుమోనియా వంటి వ్యాధులు ఏర్పడవచ్చని తెలిపారు. ఉడికించని గొడ్డు మాంసం తింటే, వేడి చేయని పాలు, శీతల పానీయాలు, అపరిశుభ్రమైన నీరు, నిల్వ ఉంచిన ఉల్లిపాయల ద్వారా ఇవి వ్యాపిస్తాయి.


సచివాలయంలో ట్రెక్ తమిళనాడు పథకాన్ని ప్రారంభించి మార్గదర్శకులకు యూనిఫాం, జీపీఎస్ పరికరం తదితర సామగ్రిని అందజేసిన ఉపముఖ్యమంత్రి ఉదయనిధి, అటవీ శాఖ మంత్రి పొన్ముడి


చెన్నై వన్నియతేనాంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు దీపావళి సందర్భంగా ఇండియన్ బ్యాంక్ సీఎస్ఆర్ విద్యాపథకం కింద స్కూలు బ్యాగులు, యూనిఫాం, నోటు పుస్తకాలు అందజేస్తున్న ఆ బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మహేష్‌కుమార్ బజాజ్ తదితరులు


గిండిలోని గాంధీమండపం వద్ద స్వాతంత్ర్య సమరయోధులు మరుదుపాండ్య సోదరుల వర్ధంతి సందర్భంగా వారి విగ్రహాల వద్ద నివాళులర్పిస్తున్న మంత్రులు పీకే శేఖర్‌బాబు, ఎం.సుబ్రమణ్యం, సామినాథన్, మేయర్ ప్రియ తదితరులు


తమిళనాడు డాక్టర్ ఎంజీఆర్ వైద్య విశ్వవిద్యాలయం ప్రాంగణంలో వారి చిత్రపటాలకు పుష్పాంజలి ఘటిస్తున్న గవర్నర్ ఆర్ఎన్ రవి.

ప్రభుత్వ సిబ్బంది, ఉపాధ్యాయులకు 3 శాతం డీఏ పెంచినందుకు సచివాలయంలో ముఖ్యమంత్రి స్టాలిన్‌ను కలిసి ధన్యవాదాలు తెలుపుకుంటున్న సచివాలయ ఉద్యోగుల సంఘం, ఉపాధ్యాయ సంఘాల నాయకులు

